RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 96 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి మంగళవారం 7-4-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥పంచమి మ॥2.04, జ్యేష్ఠ తె ॥3.35, వర్జ్యం ఉ॥ 7.10 - 8.57, దుర్ముహూర్తం ఉ॥ 8.21-9.10, శుభ సమయం మ॥ 12.00-1.30, రాహుకాలం మ॥3.00-4.30, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

రామాపురం డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన మంత్రి నారాయణ 8లో




# నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

- భూమిలో నీరు ఇంకితేనే సేద్యానికి సాధ్యం
- నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి
- నీటి భద్రతలో రైతులు భాగస్వామ్యం కావాలి
- గతంలో ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు చేపట్టాం
- మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తున్నాం
- 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత'లో సిఎం చంద్రబాబు
- మావిగన్ పేరుతో అమరావతిని అడ్డుకునే కుట్రలు

**అనంతపురం, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బ్యాంక్‌లో నగదు దాచుకున్నట్లు మనం నీటిని భూమిలో దాచుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు. అనంతపురం జిల్లా యాడికిలో చంద్రబాబు పర్యటించారు. 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు. వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసని అన్నారు. నీటిని సంరక్షించుకోవడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని మిగతా 2లో..

# సామాజిక అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాలి

## - స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్

- మిస్సైల్ ఉమెన్ ఆఫ్ ఇండియా టెస్సీ థామస్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం
- 74 మందికి డాక్టరేట్లు - 31 మందికి బంగారు పథకాలు
- స్నాతకోత్సవానికి 40 వేల మందికి డిగ్రీలు ప్రదానం



**అనంతపురం,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సామాజిక అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. బలమైన సామర్థ్యం రాష్ట్రానికి ఉందని గవర్నర్ తెలిపారు. సోమవారం అనంతపురం జేఎన్టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగిన 15వ స్నాతకోత్సవానికి గవర్నర్ ఛాన్సలర్ హోదాలో, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత జేఎన్టీయూ గెస్ట్ హౌస్ వద్ద గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ కు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ మధు మూర్తి, వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు, రిజిస్ట్రారర్ కృష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవల్యూషన్ డా. నాగప్రసాద్ నాయుడు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉపకులపతి హెచ్. సుదర్శన్ రావు అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అత్యుత్తమైన విద్య అంటే జీవితంలో సమస్త సృష్టిలో సామరస్యంగా మిగతా 2లో..

# కాల్పుల విరమణ దిశగా ఇరాన్, అమెరికా..

## – ముసాయిదా ప్లాన్‌ను రెండు దేశాలకు అందించినట్లు సంబంధిత అధికారులు వెల్లడి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 6 (ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెరదించడం కోసం అమెరికా, ఇరాన్ మధ్య చర్చలకు పాకిస్థాన్, తుర్కియే, ఈజిప్టు మధ్యవర్తిత్వం వహిస్తున్నాయి. ఈ క్రమంలో ఒక ముసాయిదా ప్లాన్‌ను రెండు దేశాలకు అందించినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఆ ప్లాన్‌లో 45 రోజుల కాల్పుల విరమణ, హార్మూజ్‌ను తెరవడం వంటి అంశాలను ప్రతిపాదించారు. 45 రోజుల సమయంలో శాశ్వత కాల్పుల విరమణ దిశగా విస్తృత చర్చలు జరిపేందుకు అవకాశం లభిస్తుందని భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ముసాయిదాను అమెరికా, ఇరాన్ పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు, ఇరాన్ అధికారి ఒకరు అంతర్జాతీయ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. తన దేశ వైఖరిని వెల్లడించారు. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కోసం తమ దేశం హర్మూజ్ జలసంధిని తెరవబోదని స్పష్టం చేశారు. ఈ పరిణామాలపై భారత్‌లో ఇరాన్ అంబాసిడర్ డాక్టర్ మహమ్మద్ ఫతాలీ స్పందించారు. శాశ్వత శాంతికి హామీలేని ఇలాంటి ప్రయత్నాల పట్ల తాము జాగ్రత్తగా వ్యవహరిస్తామని చెప్పారు. ఇలా ఘర్షణలు, కాల్పులు విరమణ వంటి విషయాల్లో తమకు మంచి అనుభవాలేం లేవన్నారు. అయితే రెండు దేశాల నుంచి ఈ ప్లాన్‌పై అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇదిలాఉంటే.. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో తమ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్‌కు చెందిన ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ మాజిద్ ఖాదేమీ చనిపోయారని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ రోజు తెల్లవారుజామున అతడు మృతి చెందాడని చెప్పింది.

# కాంగ్రెస్ ఎప్పటినుంచో పాక్ పాట పాడుతోంది

## – అస్సాం ఎలక్షన్ ర్యాలీలో ప్రధాని మోదీ



**గువాహటి, ఏప్రిల్ 6 (ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్ పార్టీ పాకిస్థాన్‌తో సంబంధాలు నెరుపుతున్నట్టు దేశ ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. అస్సాంలో జరిగిన ఎలక్షన్ ర్యాలీలో పాల్గొన్న మోదీ దేశ భద్రతపై ప్రతిపక్షం వ్యవహరిస్తోన్న తీరుకు ఇప్పటికే పలుమార్లు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని విమర్శించారు. "సిందూర్ సమయంలో కూడా కాంగ్రెస్ పాక్ పాటే పాడింది. ఈ సంబంధం ఇప్పటిది కాదు.. ఎప్పటి నుంచో సాగుతోంది. ఇది జాతీయ భద్రతను తీవ్రంగా దెబ్బతీస్తోంది" అని మోదీ పేర్కొన్నారు. "నిన్న పవన్ ఖేరా, గౌరవ్ గొగోయ్ దిల్లీలో, గువాహటిలో రెండు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. అయితే ఆ కాన్ఫరెన్స్‌కి సంబంధించిన మొత్తం సమాచారాన్ని పాక్ సామాజిక మాధ్యమాల నుంచి తీసుకున్నట్టు గుర్తించాం. అస్సాం ఎన్నికలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో మిగతా 2లో..

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ఊరూవాడా జెండా ఎగరేసిన పార్టీ శ్రేణులు
- రాష్ట్ర కార్యాలయ వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు పివిఎస్ మాధవ్
- పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు




**విజయవాడ, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ వ్యాప్తంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా పార్టీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర మిగతా 2లో..

# నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టాం... గత ప్రభుత్వంలో 20శాతం పనులు మాత్రమే చేశారు

ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయ్యాయి... పోర్టు పనులను పరిశీలించిన మంత్రులు జనార్ధన్, అచ్చెన్న



**శ్రీకాకుళం, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష మూలపేట పోర్టు అని మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టామని.. 1,524 ఎకరాల్లో 4 బెర్త్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మూలపేట పోర్టును ఈ నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూలపేట పోర్టును మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పరిశీలించామని.. ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో 20 శాతం పనులు మాత్రమే చేశారని.. ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 20 నెలల్లోనే 49.63 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి అయినట్లు మిగతా 2లో..

# హార్ముజ్ జలసంధిని వెంటనే తెరవండి

- ఇరాన్‌పై తీవ్రపదజాలంతో విమర్శలు... లేదంటే సర్వనాశనం చేస్తానని ట్రంప్ వార్నింగ్
- లెక్కచేయకుండా ప్రతిదాడులకు దిగుతోన్న ఇరాన్



**వాషింగ్టన్, ఏప్రిల్ 6 (ఆర్ఎన్ఎ):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై బూతులతో రెచ్చిపోయారు. తాను ఎంతగా హెచ్చరించినా హోర్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవక పోవడంతో ట్రంప్ తీవ్ర ఆవేశానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ వేదికగా ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. హోర్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌పై భీకర దాడులు తప్పవని హెచ్చరిం చారు. మంగళవారం పవర్ ప్లాంట్ డే. బ్రిడ్జి డే. అన్నీ కలిపి ఇరాన్‌లోనే జరుగుతాయి. దీనికేదీ సాటిరాదు. హోర్ముజ్ జలసంధిని తెరవండి. లేకుంటే ఇరాన్‌లో కాదు. నరకంలో ఉన్నట్లే. చూస్తూ ఉండండి. అల్లాను ప్రార్థించండి అంటూ ట్రంప్ పేర్కొన్నాడు. అంతేకాదు.. ఇందుకోసం రాయలేని రీతిలో బూతు పదాల్ని వాడాడు. హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందే అని ఇరాన్‌కు ఇప్పటికే ట్రంప్ హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. తాను చెప్పినట్లు చేయకపోతే ఇరాన్‌లోని బ్రిడ్జిలు, పవర్ ప్లాంట్లపై దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. తీవ్రంగా గాయపడిన తమ ఎఫ్-15 యుద్ధ విమాన సిబ్బందిని ఇరాన్‌లోని మిగతా 2లో..

# రాష్ట్రంలో సరపడా ఎల్పీజీ నిల్వలు

## రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీవాస్ నుపుర్ అజయ్ కుమార్



**విజయవాడ, ఏప్రిల్ 6 (పీఐబీ):** రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు సరపడా ఉన్నాయని, ప్రజలెవరూ ఆందోళనతో బుకింగ్స్ చేయొద్దని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీమతి శ్రీవాస్ నుపుర్ అజయ్ కుమార్, ఐఏఎస్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాయని తెలియజేశారు. రాష్ట్రంలో నిరంతరాయ ఎల్పీజీ గ్యాస్, ఇంధన సరఫరాకు తీసుకుంటున్న చర్యలతో పాటు ఎరువులు, రసాయనాల నిల్వలకు సంబంధించిన సమాచారాన్ని తెలియజేసేందుకు ఈరోజు (06.04.2026) విజయవాడలోని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్రీమతి శ్రీవాస్ నుపుర్ అజయ్ కుమార్, ఐఏఎస్ తో పాటుగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) - విజయవాడ డైరెక్టర్ శ్రీ జీ.సురేష్ కుమార్, ఐఐఎస్, శ్రీ వీడీవీ కృపాదాస్, జేడీఏ, విత్తనాలు , ఎరువుల శాఖ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, శ్రీ భాస్కర రెడ్డి - జీఎమ్-ఎస్ఎల్సీ, విజయవాడ రిటైల్ ఆర్ఓ పాల్గొన్నారు.

**సమావేశంలో వెల్లడించిన అంశాలు:**

**ఎల్పీజీ, పీఎన్జీ సరఫరా**

- రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నాము, ప్రస్తుతం మన వద్ద 14,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ నిల్వలు సిద్ధంగా ఉన్నాయి.
- ప్రతిరోజు సగటున 4 వేల మెట్రిక్ టన్నుల గృహ వినియోగ ఎల్పీజీ సరఫరా చేస్తున్నాము, వినియోగదారులందరికీ 100 శాతం ఇంటికే వచ్చి డెలివరీ అందజేస్తాము.
- విద్యా సంస్థలు, హాస్టళ్లకు ఎల్పీజీ సరఫరాలో మొదటి ప్రాధాన్యత ఇస్తూ పూర్తి స్థాయిలో గ్యాస్ అందిస్తున్నాము.
- వాణిజ్య అవసరాల కోసం గత వినియోగంలో సగటున 70 శాతం మిగతా 2లో..

# భాజపా మరిన్ని విజయాలు సాధించాలి: సీఎం చంద్రబాబు



**అమరావతి, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భాజపా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్న పార్టీ భాజపా అని కొనియాడారు. మన సంస్కృతి, ప్రజాస్వామ్య విలువలను ఆ పార్టీ బలోపేతం చేస్తోందన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు వేగంగా ప్రజలకు సేవలందిస్తోందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాజపా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిం చారు. భాజపా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. భారత్‌ను బలమైన దేశంగా మార్చడంలో భాజ పాది కీలక పాత్ర అని కొనియాడారు. ఏపీకి ఆ పార్టీ అందిస్తున్న స్థిరమైన మద్దతు ఎంతో విలువైందని పేర్కొన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనకు తామంతా కట్టుబడి ఉన్నామన్నారు.

మీశక్తిని వ్యర్థమైన మాటల్లో వృథా చేయక, మౌనంగా ధ్యానం చేయండి. మనశ్శక్తిని సమీకరించి ఆధ్యాత్మిక శక్తిజనకయంత్రంగా అవతరించండి.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# సహజవాయువు కోసం ఉద్యమించాల్సిందే!

పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధనం, గ్యాస్ సమస్యలు తీవ్రం అవుతున్నాయి. ప్రధానంగా గ్యాస్ సమస్య తీవ్రత పెరుగుతోంది. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ట్రంప్ బెదిరింపులు, హుంకరింపులతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఇరాన్ కూడా తగ్గేది లేదన్నట్లుగా పోరాడుతోంది. అమెరికా యుద్ద విమానాలను కూల్చేస్తోంది. 48 గంటల గడువు ముగిసిన వేళ, నియంత ట్రంప్ ఏ దుర్మార్గాలకు ఒడిగడతాడో తెలియడం లేదు. ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రం తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొంటోంది. సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు హోటల్ నిర్వాహకులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని తినుబండారాల ధరలు పెరుగుతున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచుతుందన్న ప్రచారం కూడా సాగుతోంది. అదే జరిగితే నిత్యావసరాల ధరలు మిన్నంటే ప్రమాదం వుంది. మరోవైపు సహజవాయువు కేటాయింపులు లేక రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు మూతపడే దుస్థితి ఏర్పడింది. ఫలితంగా అధిక రేటుకు డిస్కంలు విద్యుత్ కొనాల్సి వస్తోంది. ఈ క్రమంలో దేశీయంగా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్యాస్ కొరతతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. హోటల్ పరిశ్రమ కుదేలవుతోంది. కట్టెల పొయ్యి లతో కొన్నిచోట్ల నెట్టుకు వస్తున్నారు. విద్యుత్ స్టవ్‌ల ఉత్పత్తి పెరిగింది. అయితే తగినంత విద్యుత్ సరఫరా కూడా కష్టంగానే ఉంది. ఎండాకాలం కావడంతో అడపాదడపా కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి సహజవాయువును గృహ, హోటల్ అవసరాలకు మళ్లించాలి. అప్పుడు డిమాండ్‌లో కనీసం 50శాతం అయినా అధిగమించగలం. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల హక్కు. ఇక్కడి వనరులు వీరికే దక్కాలి. ఈ సహజ వాయువులో కనీసం సగం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని సిపిఎం అధ్వర్యంలో వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, సంస్థలకు చెందినవారు డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్ కూడా న్యాయంగా ఉన్నదే. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే డిమాండ్‌తో జనవిజ్ఞాన వేదికవంటి వివిధ సంస్థలు అనేక రూపాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాయి. అయితే ఆ తరువాత ఉమ్మడి రాష్ట్ర విభజన కోరుతూ ఆందోళనలు, ఇతరేతర కారణాలతో అది వెనక్కు వెళ్లింది. ఈ గ్యాస్ వల్ల ఎపి ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుంది. ప్రజల సమస్యలు తీరుతాయి. దీనిపై చంద్రబాబు పట్టుబట్టాల్సిన తరుణం ఇది. అయితే కార్పోరేట్ దిగ్గజాల చేతిలో ఉన్న ఈ వ్యవహారం విషయంలో చంద్రబాబు అంత తొందరగా నోరువిప్పుతారని అనుకోరాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడా రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఇక్కడ లభించే గ్యాస్ ఇక్కడి ప్రజలకు సరఫరా చేస్తే... రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం సమకూరుతుంది. ఈ విషయంలో స్థానిక ప్రజలే ఉద్యమాలు చేపట్టాల్సి ఉంది. బ్లో అవుట్‌లతో బాధలు పడుతున్న ప్రజలు, గ్యాస్ వల్ల లాభాలు కూడా పొందాలి. మన గ్యాస్ మనకే అని ఉద్యమించాలి. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కృష్ణా- గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును రోజుకు 21 వేల టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. రిలయన్స్ కంపెనీ పైపులైన్ల ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించి వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ వినియోగం రోజుకు నాలుగు వేల టన్నులు. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాలతో నిత్య కాలుష్యమేగాక బ్లో అవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలను కోల్పోతున్నది. అత్యంత విలువైన సహజ వనరులను రాష్ట్రం కోల్పోతోంది. కనుక నష్టాలు రాష్ట్రానికి, లాభాలు రిలయన్స్‌కు చెందడం సరికాదు. ఇక్కడి సహజవాయువును కనీసం 50శాతం ఇక్కడి ప్రాంత ప్రజలకు కేటాయించిన తరవాతనే మిగతాది తరలించడం న్యాయం. మన తీరంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ రాష్ట్రానికి కేటాయిస్తే కరెంటు కష్టాలు కూడా తగ్గుతాయి. కాబట్టి రాష్ట్రంలో లభించే ప్రకృతి వనరులను సరిగా వినియోగించు కుంటే ఇలాంటి ఇబ్బందులు రావు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో మన వాటా మనకు వస్తే రూ.950 ఉన్న సిలిండర్ ధర రూ.300- 350కు, యూనిట్ కరెంటు రూపాయికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది. పిఎన్‌జి ఇంకా తక్కువ ధరకే లభిస్తుంది. చమురు, సహజ వాయువు జాతీయ సంపద కనుక రాష్ట్రానికి ఇవ్వాల్సిన న్యాయమైన వాటా ఇచ్చి మిగిలినది ఇతర రాష్ట్రాలకు తీసుకెళితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. మన సహజ వనరులను రిలయన్స్‌కు అప్పగించి, మనం ఇబ్బంది పడటం అన్యాయం. కెజి బేసిన్‌లో చట్టబద్ధంగా రావాల్సిన చమురు, సహజవాయువు వాటాను పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అవసరమైతే అసెంబ్లీ తీర్మానించాలి. ఈ విషయంలో అఖిలపక్షంలో చర్చించాలి. గతంలోకి వెళితే కృష్ణా-గోదావరి డి6 బేసిన్ ను రిలయన్స్ ఇండిస్ట్రీస్‌కు 20 ఏళ్ల క్రితం అప్పుడున్న ప్రభుత్వాలు చట్టవిరుద్ధం గా కేటాయించాయి. భూగర్భ నిక్షేపాలను కనుగొన్నపుడు లభించే ఉత్పత్తుల్లో ఆయా కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి వాటాగా సరఫరా చేసే చమురు, సహజవాయువులో 50 శాతాన్ని సంబంధిత రాష్ట్రాలకు కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఈ విషయాన్ని గురించి పెట్రోలియం మంత్రిత్వ శాఖను నిలదీసింది. కనుక ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో ఉత్పత్తి అవుతున్న కృష్ణా-గోదావరి బేసిన్ సహజ వాయువులో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. దీనిని చంద్రబాబు లేవనెత్తడం మంచిది. కేంద్రంలో అధికారం పంచుకుంటున్న చంద్రబాబు ఈ విషయంలో ఇప్పటికైనా డిమాండ్ ముందుకు తీసుకు రావాలి. రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఎలాగూ ఇవ్వడం లేదు. విభజన సమస్యలు అలాగే ఉన్నాయి. అయితే చంద్రబాబు కోరిన వెంటనే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. అందువల్ల సహజ వాయువు విషయంలో ఒత్తిడి పెంచితే కేంద్రం దిగిరాక తప్పదు. ప్రజలు కూడా ఆందోళనలకు దిగితే తప్ప రాష్ట్రానికి చురుకు పుట్టదు.

## మొదటి పేజీ తరువాయి

### నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

నిలబెట్టాలి.. నిలబడిన నీటిని నిల్వ చేయాలి.. జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాల న్నారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం వంటివి గతంలో చేపట్టామని చంద్రబాబు వివరించారు. నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాల్లో వేశామని ఏపీ సీఎం గుర్తు చేశారు. నీటి భద్రతా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రైతులు, సాగునీటి సంఘాలకు సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో తాము చేసింది.. దేశం మొత్తం అనుసరించిం దని అన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తూ దేశంలో నంబర్ వన్‌గా ఉన్నామన్నారు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు-మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే.. ప్రస్తుతం అవి 11 మీటర్లే ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతు, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా నీరు చూడాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అలా చేయగలిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు నీరు అవసరమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమలకు 28, తాగు నీటికి 158 టీఎంసీల చొప్పున మొత్తంగా 1,300 టీఎంసీల వరకూ మనకు అవసరం అవుతాయని వివరించారు. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకు వచ్చామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని.. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అని పేర్కొన్నారు. మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి అని సీఎం స్పష్టం చేశారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు రాజధాని అమరావతికి మద్దతు పలికాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఒక్క దిక్కు మాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి ముదిరి మావిగన్ అనే పేరు తెరపైకి తెచ్చారని వైసీపీ అధినేతపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారని సీఎం చంద్రబాబు వ్యంగ్యంగా అన్నారు. బాబాయిని చంపి తన చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారంటూ వైసీపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎండగట్టారు. రాజధాని అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. అవి చూసి సహించలేకే ఈ విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని వైసీపీ నేతల తీరుపై ఏపీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జలధారతో ప్రతి ఎకరానికీ జలహారతి ఇచ్చేలా కార్యాచరణ చేపడదామని ప్రజలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఎప్పటినుంచో పాక్ పాట పాడుతోంది

ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో పాకిస్థాన్ ఛానల్ 11 టాక్ షోలను నిర్వహించింది. ఇలా ఇంతకు ముందెప్పుడూ జరగలేదు. ప్రతి షోలోనూ చివరకు కాంగ్రెస్ గెలవాలని చెబుతూ ముగించారు. నిన్న జరిగిన కాన్ఫరెన్స్‌లో పాక్ జోక్యం స్పష్టంగా వెల్లడైంది" అని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సతీమణి రిణికి భూయాన్ శర్మకు 3 దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దీంతోపాటు ఆమె ఆస్తులను ఆయన అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచిపెట్టారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. "సాక్ష్యం లేకుండా తప్పుడు ఆరోపణలు చేసినప్పుడు కేసు నమోదు చేయొచ్చు. ఎన్నికల సమయంలో ప్రజలను ప్రభావితం చేసేందుకే ఇలాంటి విమర్శలు చేశారు. దానికి శిక్ష అనుభవించక తప్పదు. నిన్న నా భార్య తనపై వచ్చిన ఆరోపణలపై కేసు పెట్టింది. పోలీసులు చట్టం ప్రకారం దీనిపై చర్యలు తీసుకుంటారనే భావిస్తున్నాను. అస్సాం పోలీసులు ఇంతకుముందే పాస్‌పోర్ట్‌ల విషయంలో దర్యాప్తు చేశారు. దుబాయి పాస్‌పోర్టు ఫేక్ అని తేలినట్టు దుబాయి అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. మిగతా దేశాల రిపోర్టులు మరో రెండ్రోజుల్లో రావొచ్చు" అని హిమంత బిశ్వ శర్మ వివరించారు.

### బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగురవేసి ... నాయకులు, కార్యకర్తలకు స్వీట్‌లు తినిపించారు మాధవ్. నేటి నుంచి గ్రామపంచాయతీల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు.. మన జెండా' పేరుతో కార్యక్రమం ప్రారంభంకానుంది. దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేసిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టిందన్నారు. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి నుంచి సంపూర్ణ మద్దతుగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు బీజేపీ బలపడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనకడుగు వేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్దే లక్ష్యంగా అడుగులు వేస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసిందని సీఎం చంద్రబాబు పోస్టు చేశారు. 'భారతీయ జనతా పార్టీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న ఈ పార్టీ.. మన సంస్కృతిని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ, సమగ్ర అభివృద్ధి, దేశ సేవ కోసం నిరంతరం కృషి చేస్తోంది. పార్టీ వ్యవస్థాపక నేతల నుంచి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ తన నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో రెట్టింపు వేగంతో పనిచేస్తోన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్.. ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందిస్తూ, సహకార సమాఖ్య స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తోంది. పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో.. దేశ సేవలో బీజేపీ మరిన్ని విజయాలు సాధించాలని, 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా మన ప్రయాణాన్ని మరింత బలోపేతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

### నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

వెల్లడించారు. కరపత్రిక అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. పోర్టు కోసం కావల్సిన ఉప్పు భూముల విషయంలో వైసీపీ చిత్తశుద్ధితో పని చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఉప్పు భూముల కోసం కేంద్రంతో సంప్రదింపులు చేశామని.. 385 ఎకరాల ఉప్పు భూములను లీజ్‌పై కేంద్ర కేటాయించిందని వివరించారు. వైసీపీ నేతలు 20 నెలల తరువాత రాజకీయం చేస్తున్నారని.. ఈ 20 నెలలు నిద్ర పోయారా అంటూ మంత్రి ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసమే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ప్రజలు అందుకే బుద్ధి చెప్పారన్నారు. రాజధాని అని చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడుదాం రండి అంటూ జగన్, వైసీపీ నేతలకు మంత్రి ఛాలెంజ్ విసిరారు. గతంలో అమరావతికి ఓకే అన్న జగన్.. మోసం చేసి తరువాత మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. జగన్ అభివృద్ధి చేసే నాయకుడు కాదని.. విధ్వంసం సృష్టించే నాయకుడంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే 11సీట్లకి పరిమిత మయ్యారన్నారు. దేశంలో ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్‌లలో బోగాపురం నంబర్ 2గా నిలవనుందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. మూలపేట పోర్టు పనులు 20 శాతం నుంచి 76 శాతం పూర్తి చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పోర్టులో షిప్ వచ్చి ల్యాండ్ అయ్యిందని.. బెర్తులు లేకుండా షిప్ రాదు కదా అని అన్నారు. పోర్టు కట్టిన తరువాత రోడ్డు, రైల్ రవాణా అవసరం ఉంటుందన్నారు. పోర్టు కోసం సాల్ట్ ల్యాండ్‌లు అవసరమని చెప్పుకొచ్చారు. 385 ఎకరాల సాల్ట్ భూములను కేంద్రం లీజ్‌కు ఇచ్చిందని.. దానిపై కూడా ఒకరు కోర్టుకు వెళ్లారన్నారు. పోర్టును నవంబర్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫారెస్ట్ ల్యాండ్, జెన్ కో పవర్ సమస్యలను వీలైనంత త్వరగా అధిగమిస్తామని చెప్పారు. అడ్డగోలుగా పూర్తి చేసినట్లు వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూలపేట వాసులు త్యాగధనులని కొనియాడారు. పోర్టు వల్ల ఎంఎ÷-లాయిమెంట్ రాదని.. పోర్టు పరిసరాల్లో పరిశ్రమలు రావాల్సి ఉందని చెప్పారు. 17 కంపెనీలు ల్యాండ్ కోసం దరఖాస్తు చేశాయని తెలిపారు. మూలపేట పోర్టును సందర్శించడానికి వైసీపీని ఆహ్వానిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

### హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరవండి

పర్వత ప్రాంతాల నుంచి రక్షించామని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. పగటిపూటే.. దాదాపు ఏడు గంటలపాటు శ్రమించి ఈ రెస్క్యూ ఆపరేషన్ చేశామన్నారు. పౌరులకు, విమానాలకు ఎక్కువ ప్రమాదం ఉండే ఇలాంటి ఆపరేషన్ చాలా అరుదని చెప్పారు. అయితే, ట్రంప్ హెచ్చరికను ఇరాన్ తేలికగా తీసుకుంది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి. ఇరాన్ కూడా కువైట్, బహ్రెయిన్‌లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తోంది. అలాగే, తమ దేశంలోని పౌర కేంద్రాలపై దాడులు చేస్తే తాము కూడా మరింత బలంగా దాడి చేస్తామని ఇరాన్న ఇప్పటికే హెచ్చరించింది. ఇంకోవైపు ఇజ్రాయెల్ దళాలు లెబనాన్ రాజధాని అయిన బీరుట్‌పై దాడులు చేస్తున్నాయి. అలాగే, ఆదివారం అమెరికాకు చెందిన యుద్ధ విమానాల్ని కూల్చివేశామని ఇరాన్ తెలిపింది. సీ-130 అనే రెండు రవాణా విమానాల్ని, రెండు బ్లాక్ హ్యాక్ అనే హెలికాప్టర్లను కూల్చినట్లు తెలిపింది. మరోవైపు అణు ఆధారిత విద్యుత్ క్షేత్రాలపై దాడుల వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని ఇరాన్ ఆందోళన వ్యక్తం చేసింది. రేడియో ధార్మిక పదార్థాలు భూ, జలాలు, వాతావరణంలోకి విడుదలయితే ఇరాన్‌తో పాటు ఇరాన్ ఆవల కూడా మానవ, పర్యావరణ విపత్తులకు దారితీయవచ్చునని పేర్కొంది. అందువల్ల అమెరికా, ఇజ్రాయిల్ తమ దేశంలోని అణు విద్యుత్ స్థావరాలను లక్ష్యం చేసుకొని చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించాల్సిందిగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెర్రెస్‌కు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఒక లేఖ రాశారు. ఈ లేఖను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇరాన్‌లో పనిచేస్తున్న ఏకైక అణు విద్యుత్ ప్లాంటుపై పదే పదే జరుగుతున్న దాడులు పశ్చిమాసియాలో మానవ, పర్యావరణ ప్రమాదాలకు దారితీస్తాయని అరాగ్చీ హెచ్చరించారు. బుషెహర్ స్థావరంపై జరుగుతున్న దాడులను సహించలేని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. రేడియో ధార్మిక పదార్థాలు కలుషితమైతే ఇరాన్ సరిహద్దులకు ఆవల కూడా తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. బుషెహర్ ఎ÷-లాంటుపై నాలుగుసార్లు దాడి జరిగిందని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ ద్వారా ఆయన తెలియజేశారు. రేడియో ధార్మిక పదార్థాలు విడుదలైన పక్షంలో టెహ్రాన్ కంటే గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలకే ముప్పు ఎక్కువ అని చెప్పారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలతో లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు విధించాలని ఐదు యూరోపియన్ దేశాల ఆర్థిక మంత్రులు సూచించారు. ఈ మేరకు జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఆస్ట్రియా దేశాల ఆర్థిక మంత్రులు ఈయూ కమిషన్‌కు ఓ లేఖ రాశారు. 'మనమంతా సంఘటితంగానే ఉన్నామని, చర్య తీసుకునేందుకు సిద్ధమేనని సంకేతం పంపడానికి ఇలాంటివి అవసరం' అని వారు అభిప్రాయపడ్డారు. చమురు కంపెనీలపై భారీగా పన్నులు విధించడం ద్వారా సామాన్య ప్రజలపై భారం తగ్గుతుందని వారు తెలిపారు. దక్షిణ లెబనాన్‌లో ఐరాస శాంతి పరిరక్షక కేంద్ర కార్యాలయానికి చెందిన 17 నిఘా కెమేరాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. కోస్తా ప్రాంతంలోని నఖురా పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ కెమేరాలను ఇజ్రాయిల్ దళాలు ధ్వంసం చేశాయని లెబనాన్‌లో ఐరాస తాత్కాలిక దళాల (యునిఫిల్) ప్రతినిధి కండిస్ అర్డియల్ తెలిపారు. పట్టణంలో తిష్ట వేసిన ఇజ్రాయిల్ సేనలు అక్కడి భవనాలను పెద్ద సంఖ్యలో నేలమట్టం చేశారని ఆమె అన్నారు.

### రాష్ట్రంలో సరిపడా ఎల్పీజీ నిల్వలు

(186 మెట్రిక్ టన్నులు) సరఫరా చేస్తున్నాము; రానున్న రోజుల్లో హోటళ్లు, రెస్టారెంట్లకు ఈ సరఫరాను మరింత పెంచనున్నాము.

- 5 కేజీల సిలిండర్ల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేవు; కేవలం మార్చి నెలలోనే 5 కేజీల సిలిండర్లు మొత్తం 7,560 ప్రజలకు అందించాము.
- తప్పుడు సమాచారం వల్ల ప్రజలు భయాందోళనతో పెద్ద ఎత్తున బుకింగ్స్ చేస్తున్నారు; గతంలో రోజుకు 2 లక్షల బుకింగ్స్ ఉండగా, ప్రస్తుతం 2.5 లక్షల వరకు బుకింగ్స్ జరుగుతున్నాయి. అయినా.. సరఫరా అందుతోంది.
- గ్యాస్ బుకింగ్ రద్దీని నియంత్రించడానికి పట్టణ ప్రాంతాల్లో బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుండి 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు మార్చడం జరిగింది.
- పానిక్ బుకింగ్స్ వల్ల ప్రస్తుతం డెలివరీకి 4 నుండి 6 రోజులు సమయం పడుతోంది; పౌరులు ఆందోళన చెందవద్దని, గోడౌన్ల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకోవాలని కోరుతున్నాము.
- ప్రతి గ్యాస్ ఏజెన్సీ వద్ద ఒక సూపర్‌వైజరీ ఆఫీసర్‌ను, బాటిలింగ్ ప్లాంట్ల వద్ద డివిజన్ లెవల్ అధికారులను పర్యవేక్షణ కోసం నియమించాము.
- బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి ప్రతి జిల్లాలో అత్యవసర ప్రతిస్పందన బృందాలను ఏర్పాటు చేశాము; మార్చి 1 నుండి ఇప్పటివరకు 1,705 కేసులు నమోదు చేసి, 4,377 సిలిండర్లను సీజ్ చేశాము.
- దేశీయంగా లభ్యతను పెంచడానికి రిఫైనరీల నుండి ఎల్పీజీ ఉత్పత్తిని 20% నుండి 25% వరకు పెంచడం జరిగింది.
- గ్యాస్ సరఫరా అంతరాన్ని తగ్గించడానికి పైప్డ్ న్యాచురల్ గ్యాస్ నెట్‌వర్క్‌ను ప్రభుత్వం విస్తరిస్తోంది, అత్యవసర అవసరాల కోసం 2,000 ఖూ కిరోసిన్‌ను సిద్ధంగా ఉంచాము.
- హోటళ్లు, రెస్టారెంట్లు, దేవాలయాలు సహా భారీ పరిశ్రమలు వంటివి పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్‌లకు మారాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.
- ఈ మార్పును వేగవంతం చేయడానికి పరిశ్రమలు, పెట్టుబడుల శాఖ కీలక సంస్కరణలను ప్రవేశపెట్టి, తగిన ఉత్తర్వులను జారీ చేసింది. దీపం 2' పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు సంవత్సరానికి మూడు ఎల్పీజీ సిలిండర్ల రీఫిల్స్‌పై సబ్సిడీని ప్రభుత్వం అందిస్తోంది. దీపం పథకం లబ్ధిదారులందరికీ ఈ ప్రయోజనాలు అందేలా చూడటంతో పాటు, గృహ అవసరాలకు ఇంధన భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.

**ఎరువులు, రసాయనాలు**

- ఖరీఫ్ లో మనకి దాదాపుగా 15 లక్షల 50 వేల టన్నుల వివిధ రకాల రసాయనిక ఎరువులు అవసరం అవుతాయి. కేంద్రంతో చర్చలు జరిపి 18 లక్షల టన్నులకు కేటాయింపులు పొందాము. ఏప్రిల్ 1 నాటికి 7.33 లక్షల వివిధ రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి.
- రాష్ట్రంలో యూరియా 6.5 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం కాగా, 7.5 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపులు పొందాము. ఏప్రిల్ 1 నాటికి రాష్ట్రంలో 2 లక్షల 15 వేల మెట్రిక్ టన్నులు నిల్వలున్నాయి. ఇవి మొత్తం నిల్వల్లో 47%- 48% నికి సమానం.
- ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కాకపోవడం వల్ల జూన్ వరకు ఎరువుల అవసరం ఉండదు. కాబట్టి ఈ మూడు నెలల సమయంలో నిల్వల్ని పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం.
- ముఖ్యంగా రాష్ట్రంలో రైతులు ఎక్కువగా వినియోగించే యూరియా 1.33 లక్షల మెట్రిక్ టన్నుల అవసరం అవుతుంది. ఐతే.. కేంద్రం నుంచి 2.30 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపులు సాధించాం, వాటి సరఫరా కోసం ప్రయత్నాలు చేస్తున్నాం.
- ఇప్పటికే.. కొన్ని నౌకలు ఎరువులతో తీర ప్రాంతానికి చేరుకున్నాయి. వాటిలో నుంచి కేటాయింపుల సాధించేందుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం.

### సామాజిక అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాలి

ఉండేలా తీర్చిదిద్దేనని రవీంద్రనాథ్ ఠాకూర్ పలికిన మాటలు గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ విస్తృతమైన సంలీతమైన ఉన్నత విద్యాభివృద్ధి చేస్తోందని, మహిళల భాగస్వామ్యాన్ని పెంచి జాతీయ సగటు కంటే అధికంగా 36.5% స్థూల నమోదు నిష్పత్తి 10.93 స్థూల సూచికతో స్థిరమైన పురోగతిని ప్రతిబింబిస్తోందన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా 2020 అమల్లో భారతదేశం ఉన్నత విద్య పరివర్తనాత్మక మార్పుకు నాంది పలికిందని ఇది విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందించే విధంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రం పారిశ్రామిక విస్తరణ మౌలిక సదుపాయాల ఆధునికరణ సమగ్ర ఆర్థిక పునరజీవనం దిశగా ముందుకు సాగుతోందని పునరుత్పాదక ఇంధనం ఎలక్ట్రానిక్ హార్డ్వేర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆహార శుద్ధి వంటి రంగాలలో భారీ పెట్టుబడులు ఆకర్షిస్తూ మెరుగైన రహదారి నెట్వర్క్ అభివృద్ధిఅంతర్గత జలమార్గాలు పోర్టుల ఆధారత అభివృద్ధి విమానాశ్రయాల విస్తరణ వంటి వాటికి పరిశ్రమ వాణిజ్యం కోసం ఒకస్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు గవర్నర్ తెలిపారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోది నాయకత్వంలో భారతదేశం అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు క్రమబద్ధమైన ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించడానికి మాసివ్ ఓపెన్ ఆన్లైన్ కోర్సుల ద్వారా పరిశ్రమకు సంబంధించిన కోర్సులను అందించడానికి విశ్వవిద్యాలయం కృషి చేస్తుందని ఐఐటి మద్రాస్ ఫ్యాకల్టీ డైరెక్టర్ లతో సహా వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సహకారం ద్వారా విద్యార్థుల పారిశ్రామిక వాతావరణం భద్రత ప్రమాణాలు నియంత్రణ చట్టాలు నిత్యసమయ కార్యాచరణ పద్ధతులపై విలువైన అవగాహన పొందుతార న్నారు. మీ జ్ఞానం మీకు మాత్రమే కాకుండా యావత్తు సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు తమ జీవితంలో ముందుకుసాగాలని, నిజాయితీ, పట్టుదల, కరుణ అనే విలువలతో సత్ప్రవర్తనాలతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. నిరంతరం నూతన ఆవిష్కరణలు చేస్తూ విద్యార్థులు చేపట్టే అన్ని పనుల్లోనూ శాష్టత కోసం కృషి చేయాలి అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను అన్ని విధాల ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు పొందిన జ్ఞానం సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడాలన్నారు. దీంతో విద్యాసంస్థకు గర్వకారణం మవుతుందన్నారు. స్నాతకోత్సవంలో తాను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకాలను, పలువురికి పరిశోధకుల పీహెచ్డీ పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం చిత్తూరు కడప కర్నూలు నెల్లూరు జిల్లాలోని సాంకేతిక ఔషధ కళాశాలలు జేఎన్టీయూ పరిధిలోకి వస్తాయని ఇంజనీరింగ్ ఫార్మసీ ఎంబీఏ ఎంసీఏ కళాశాలలు మొత్తం 130 దాకా ఉన్నాయన్నారు. అన్ని కళాశాలలో కలిపి వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ రోజు బంగారు పథకాలు, విశ్వవిద్యాలయం దీని అనుబంధ కళాశాలలో బీటెక్ బి ఫార్మసీ ఎంటెక్ ఎం ఫార్మసీ ఎంసీఏ ఎంబీఏ ఫార్మసీ డి పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలు పీహెచ్.డి., డాక్టర్ రేట్లు ప్రదానం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా సాంకేతిక విద్యలో అనంతపురం జేఎన్టీయూ జాతీయస్థాయిలో ప్రత్యేక స్థానం ప్రత్యేక స్థానం సంపాదించుకుందన్నారు. సమాజానికి ఎంతోమంది శాస్త్రవేత్తలు ఇంజనీరింగ్ నిపుణులను అందించిన ఘనత ఈ విశ్వవిద్యాలయానికి దక్కుతుందన్నారు. ప్రముఖ అంతరిక్ష క్షిపణి శాస్త్రవేత్త టెస్సీకు గౌరవ డాక్టరేట్ ప్రదానం గవర్నర్ చేతుల మీదుగా అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు ప్రముఖ శాస్త్రవేత్త టెస్సీ థామస్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేడు ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఇన్స్టిట్యూట్ మెడల్స్ పొందిన టాపర్లకు , 20 25 లో పట్టభద్రులైన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. స్నాత కోసం అనేది పట్టుదలకు ఒక వేడుక అని క్రమశిక్షణకు ఒక నివాళి, అపరిమితమైన అవకాశాలకు ముఖ ద్వారం అని ఇది సంవత్సరాల తరబడి అంకిత భావం, పట్టుదల, అభ్యసనం పట్ల అంచంచలమైన నిబద్ధతకు నిదర్శనం అన్నారు.

## ముక్కంటి ఆలయ ఉద్యోగుల అవస్తలు



**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముక్కంటి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు అవస్థలు పడాల్సి వస్తోంది. విధుల్లో చేరే ముందు వాళ్లకు విధులు వేశారన్న సమాచారానికి శివయ్య గోపురం వద్ద కార్యాలయం వద్దకు వెళుతారు. అక్కడ చిన్నపాటి కార్యాలయం కావడంతో ఉద్యోగులందరూ ఆత్రుతతో కార్యాలయం వద్ద గుంపులుగా నిలబడాల్సి వస్తోంది. పొరపాటున జారిపడితే అంతే సంగతి. ఇలాంటి కష్టాలు తప్పించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

## పుష్కరిణి.. పులకింత

**- ఆహ్లాదకంగా గడుపుతున్న ప్రజలు**



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి పట్టణంలోని కోనేర్లు పూర్తిగా నిండి కళ కళ లాడుతున్నాయి. పుష్కరిణిల వద్ద భక్తులు, స్థానికులు ఆహ్లాదకరంగా గడుపుతున్నారు. జయరామరావు వీధిలోని వైష్ణవ పుష్కరణీలో రంగు రంగుల చేపలు పిల్లలు, పెద్దలను మైమరిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పుష్కరిణి నిండడంతో సాయంత్రం వేళ చేపలకు ఆహారం వేసేందుకు పిల్లలు, పెద్దలు పుష్కరిణి వద్దకు చేరుకుని పులకిస్తున్నారు. ఐదేళ్ల క్రిందట కోనేరు ఎదురుగా ఉన్న ఓ అక్వేరియం షాపు నిర్వాహకుడు రంగు చేపలను పుష్కరిణిలో వదిలారు అవి పెరుగుతూ వాటి సంతతిని వృద్ధి చేశాయి. దీంతో ఎక్కడ లేని విధంగా ఈ కోనేరులో వర్షాకాలంలో భారీ రంగు చేపలు గోల్డ్ ఫిష్, వైట్,బ్లాక్ చేపలు పిల్లలను ఆకర్షిస్తున్నాయి. నారద పుష్కరిని కూడా నిండుకుండలా కనువిందు చేస్తోంది.

## మలుపు... ప్రమాదాలకు పిలుపు



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణం లోని ఏపీ సీడ్స్ కూడలిలో రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు కుంగి పోవడంతో ప్రమాద కరంగా మారింది. గుంతలకు అడ్డుగా సూచికలు పెట్టినా రాత్రివేళల్లో అర్ధరాత్రి తర్వాత మంచు కురుస్తుం డటంతో ప్రమాదకరంగా మారుతోంది. మలుపు కావడం వాహనాలు రాక పోకలు వేగంగా రావడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అంబేద్కర్ భవన నిర్మాణానికి సహకరించండి

**సత్యవేడు, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి,ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణానికి కావలసిన రూ.50 లక్షలు, అలాగే కేవిబి పురంలో టిటిడి కళ్యాణ మండపం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్లు కు విన్నవించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి ఫిర్యాదుల దినాన్ని పురస్కరించుకొని,సత్యవేడు బార్ అసోసియేషన్ కార్యదర్శి రాజ తో కలిసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై ఈ మేరకు వినతి పత్రాన్ని కలెక్టర్ కు అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ. కేవిబి పురం లో టిటిడి కళ్యాణ మండపానికి స్థలం కేటాయించాలని కలెక్టర్ తో ప్రస్తావించగా ఆయన వెంటనే కేవిబి పురం తహసీల్దార్ కు ఫోన్ చేసి స్థలం చూపాలని ఆదేశించిన్నట్లు తెలిపారు. కళ్యాణ మండపం నిర్మాణానికి టిటిడి ఈఓ కు లేఖ రాస్తానని తెలిపినట్లు ఎమ్మెల్యే చెప్పారు. తన వినతులకు కలెక్టర్ వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే సంతోషం వ్యక్తపరిచారు.

## మదనపల్లెలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

**- కార్యకర్తలు, నాయకులతో కలిసి బైక్ ర్యాలీ**

**- శుభాకాంక్షలు తెలిపిన మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిత రాజు**

**మదనపల్లె, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయం వరకు సోమవారం ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిత రాజు, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిషిత రాజు మాట్లాడుతూ దేశ సరిహద్దులను పరిరక్షించడం, అంతర్గత భద్రతను పటిష్టం చేయడం, అభివృద్ధిలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడం, భారతీయ సంస్కృతి, చరిత్రను, జీవన విధానాలను పునరుజ్జీవింపజేయడం, ఇలా అన్ని విషయాల్లోను బీజేపీ తన సంకల్పాలను ఆచరణలో చూపించిందన్నారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ మాట్లాడుతూ బీజేపీ మూలమంత్రం దేశమే ప్రథమం, పార్టీ తదుపరి, వ్యక్తి చివరగా ప్రతి బీజేపీ కార్యకర్త ఈ ప్రధాన భావనతోనే, రేయింబవళ్లు దేశ సేవకు అంకితమై పనిచేస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ ప్రయోజనాలనే మహాయజ్ఞంలో తమ సర్వస్వాన్ని త్యాగం చేసి, బీజేపీని ఒక మహా వటవృక్షంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన కార్యకర్తలందరికీ తాను శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని ప్రకటించారు. దేశ సేవ, విలువలతో కూడిన రాజ కీయాలు, అభివృద్ధి పట్ల పార్టీకి నిబద్ధత నిజంగా ప్రశంసనీయమని కితాబునిచ్చారు. భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా, ఈ అద్భుతమైన స్థానానికి పార్టీని చేర్చడం వెనుక ప్రతి కార్యకర్త అంకిత భావం, త్యాగం , కఠోర శ్రమ దాగిఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్లంపల్లి ప్రశాంత్, నరేంద్ర రెడ్డి, ఆనంద్, బాలజ్యోతి, కృష్ణమూర్తి, మోహన్, పురుషోత్తం, భగవాన్ , బర్నేపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

## ఫార్మసీ కౌన్సిల్ ఎగ్జిగ్యూటివ్ బాడీ ఏర్పాటుకు నోటిఫికేషన్ ఇవ్వాలి

**-ప్రభుత్వానికి ఏపి కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ వినతి**



**తిరుపతి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో ఫార్మసీ కౌన్సిల్ ఎగ్జిగ్యూటివ్ బాడీ ఏర్పాటుకు త్వరగా నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏపి కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పోతినేని వెంకటరత్నం, గౌరవ ప్రధాన కార్యదర్శి కె కరుణ కుమార్ గుప్త, శివకుమార్, సాధు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ఫార్మశీ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించబడ్డాయని ఆ ఎన్నికల్లో ఏపి కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ బలపరచిన ఆరుగురు అఖండ మెజారిటీతో గెలుపొందారన్నారు. అయితే గత ఇంతవరకు ఫార్మసీ కౌన్సిల్ ఎగ్జిగ్యూటివ్ బాడీ ఏర్పాటు కాలేదని మూడు మాసాలుగా ఎదురు చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో 38 వేల రీటైల్ మందుల షాపులు,10 వేలకు పైగా హెూల్ సేల్ ఏజన్సీలు,చిన్న,పెద్ద ఆస్పత్రులు 7 వేలు ఉన్నాయని ఇవన్నీ మన రాష్ట్రం నుండి కాకుండా ఎక్కువగా ఇతర రాష్ట్రాలలో కంపెనీలు, డిపోలు, క్యారీ ఫార్వర్డ్ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా గత 30 ఏళ్లుగా ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న గ్లాక్సో కంపెనీ ఎంఎస్‌డి,అల్కెమ్ వంటి కంపెనీలు ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లాయన్నారు.ఈ కారణంగా ఏపి లాజిస్టిక్స్,వేర్‌హౌస్,విద్యుత్ వినియోగం,ఉపాధి కల్పన వంటి అంశాలలో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోతోందన్నారు.10 వేల డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ ఉద్యోగావకాశాలను రాష్ట్రం కోల్పోవలసి వచ్చిందని,మన రాష్ట్రం నుండి టర్నోవర్ నిలిచిపోవడం వల్ల సుమారు 7 వేల కోట్ల రూపాయలకు పైగా మందుల వ్యాపారం ఆగిపోయిందన్నారు.ఇలాంటి పరిస్థితుల కారణంగా కరోనా వంటి విపత్కర సమయంలో అవసరమైన మందుల కొరత ఏర్పడిందని,అలాగే మన రాష్ట్రంలో మందుల తయారీ డిపోలు అందుబాటు లో ఉంటే వాటి నాణ్యత పరిశీలనకు ఔషధ నియంత్రణ అధికారులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు.బయట రాష్ట్రాల నుండి వచ్చే మందుల అమ్మకాల కంపెనీలు అన్నీ మన రాష్ట్రంలో డిపోలు,సీఎఫ్ఏ ఏజన్సీలు ఏర్పాటు చేసేలా ఆదేసించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## ఏప్రిల్ 12న హైదరాబాద్‌లో అవార్డుల ప్రదానం

**- ఏప్రిల్ 8లోపు దరఖాస్తు చేయండి**

**తిరుపతి, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సమాజ సేవను లక్ష్యంగా పెట్టుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12, 2026న విశిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ సరోజమ్మ తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా, ఆంధ్ర డొక్కా సీతమ్మ, అన్నపూర్ణాదేవిగా ప్రఖ్యాతి గాంచిన సౌందర్య వీరి పేర్లపై "స్వర్ణ నంది" మరియు "జాతీయ వికాస" పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. జానపద కళాకారులు, నాయకులు, సమాజ సేవకులు, టీవీ యాంకర్లు, కళాకారులు, వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వ్యక్తులను ఎంపిక చేసి ఈ ఐకాసా అవార్డులతో సత్కరించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ముందస్తుగా నమోదు చేసుకున్న వారికే అవకాశం కల్పించబడుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏప్రిల్ 12న నిర్వహించబడుతుందని తెలిపారు. వివరాలకు 6302908528 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. సమాజానికి సేవ చేసే వ్యక్తులను ప్రోత్సహించడం సంస్థ ప్రధాన ఉద్దేశమని, భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.

## ఘనంగా కొండేపాటి గంగాప్రసాద్ జన్మదిన వేడుకలు

**- సేవా కార్యక్రమాలు చేపట్టిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ**

**నాయుడుపేట, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సూళ్లూరుపేట పట్టణంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు.సోమవారం ఉదయం కొండేపాటి గంగ ప్రసాద్ నివాసంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, యువత ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు.అనంతరం స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం ఏర్పాటు ఫ్యాన్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యల తోపాటు క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు.సూళ్లూరుపేట సాయి నగర్ లో స్థానిక మహిళలకు చీరలను పంపిణీ చేశారు. మహిళల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ (కూటమి) నాయకులు, కార్యకర్తలు,అభిమానులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు పంట నష్టపరిహార చెక్కుల పంపిణీ



**పలమనేరు, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు నియోజకవర్గ పరిధిలో ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రైతులకు పరిహారపు చెక్కులను పలమనేరు శాసన సభ్యులు అమరనాథరెడ్డి సోమవారం పంపిణి చేశారు. పలమనేరు మండలానికి చెందిన 62 మందికి రూ.4,35,350, గంగవరం మండలంలో 13 మందికి రూ.1.02.000, బంగారు పాళ్యం మండలంలోని 7 మందికి రూ. 38,750, బైరెడ్డిపల్లి మండలంలో 8 మందికి రూ. 66,700, వీ. కోట మండలంలోని 5 మంది రైతులకు రూ. 16,375, ఓ పాడి ఆవు మృతికి రూ. 8 వేలతో కలిపి 96 మంది రైతులకు 6,67,175 రూపాయల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ ఏడాది 600 రైతులకు రూ. 47 లక్షల పరిహారాన్ని అందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ వేణుగోపాల్ రెడ్డి, ఎఫ్ ఆర్ ఓ నారాయణ తో పాటు పలమనేరు అటవీ శాఖ రేంజ్ పరిధిలోని ఎఫ్ఎస్ వో లు, డిఆర్వో లు, ఎఫ్ బీ వో లతో పాటు మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, తెలుగుదేశం పార్టీ నాయకులు సోమశేఖర్ గౌడ్, రాంబాబు, నాగరాజు రెడ్డి, జగదీష్ నాయుడు, ఈశ్వర్ గౌడ్,చంద్ర శేఖర్ రెడ్డి, గుణశేఖర్, హరి, ఎస్ఎఫ్ఓలు సుకుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల బెడదపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

**పలమనేరు, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు పట్టణంలోని పాటపేట ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువైందని దీనిపై అధికారులకు తెలియజేసిన ఏ మాత్రం పట్టించుకోవడంలేదని రాధా బంగ్లా వాసులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. రాధా బంగ్లా, గుడియాత్తం రోడ్డు, శ్రీనగర్ కాలనీ ప్రాంతాలలో కుక్కల బెడద అధికంగా ఉందని ఆయనకు వివరించారు. చిన్నారులు పాఠశాలలకు వెళ్లే సమయంలో కుక్కలు గుంపులు గుంపులుగా కరవడానికి వస్తున్నాయన్నారు. చాలామంది కుక్క కాటుకు గురికావడమే గాక పలువురు ద్విచక్ర వాహనదారులు సైతం ప్రమాదానికి గురైన సంఘటనలో ఉన్నాయని ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డికి ఫోన్‌చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే కుక్కలకు వ్యాక్సినేషన్ వేయించడం జరిగిందని కమిషనర్ తెలియజేశారు. అయినప్పటికీ వీధి కుక్కలను పట్టించి దూర ప్రాంతాలలో విడిచి పెట్టేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## భక్తుల కొంగుబంగారం తెట్టు శ్రీ పాలేటి గంగమ్మ

**- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు**

**మదనపల్లె/ కురబలకోట, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెట్టు శ్రీ పాలేటి గంగమ్మ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. సోమవారం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారికి మొక్కులు చెల్లించి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త పూజారి అంజి మాట్లాడుతూ .. చుట్టుపక్కల గ్రామ ప్రజలు శ్రీపాలేటి గంగమ్మ తల్లిని పూజించిన తరువాతే వ్యవసాయ పనులను ప్రారంభిస్తారని తెలిపారు. ఆ తల్లి కృపతోనే పంటలు సమృద్ధిగా పండుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయం ఉండడంతో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారని చెప్పారు. మహిమ గల ఆలయం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తుంటారని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

# తిరుపతి జిల్లా

### ఐయన్‌టియస్‌ఓ పరీక్షలో

## శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ



**నాయుడుపేట, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట - శ్రీచైతన్య స్కూల్‌లో ఐయన్‌టియస్‌ఓ పరీక్షా లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఏ.జి.యం. నగ్రా శ్రీకాంత్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా నాయుడుపేట మున్సిపల్ కమీషనర్ షేక్ ఫజులల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫజులల్లా మాట్లాడుతూ విద్యార్థులలోని ఆలోచనా శక్తిని, విజ్ఞానాన్ని మెరుగుపరుస్తూ, ప్రతిభను వెలికితీసే విద్యాబోధన అందించే శ్రీచైతన్య విద్యావిధానం ఎంతో ఉన్నతమైనదని ప్రశంసించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అంబటి రవీంద్ర మాట్లాడుతూ... విద్యార్థులలోని జ్ఞానాన్ని వృద్ధిచేస్తూ ప్రపంచంలో వారిని విజ్ఞానఖనులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహించే ఐ.యన్.టి.యస్.ఓ. పరీక్షా ఎంతో తోడ్పాటు కల్పించి, చైతన్యవంతులను చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి లాప్ టాప్ చుక్కా చార్విక్, ఫస్ట్ ప్రైజ్ గా టాబ్ పఠాన్. చమన్ ఖాన్, రెండవ బహుమతి స్మార్ట్ వాచ్ బత్తైన. ప్రణయ్, మూడవ బహుమతి స్కూల్ బ్యాగ్ నల్లూరి జిజ్ఞసాయి, కందల హర్షిత అందుకున్నారు. వీరితోపాటుగా 12 మంది విద్యార్థులు స్పెషల్ బహుమతి, 67 మంది విద్యార్థులు కన్సలేషన్ బహుమతి, 127మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్‌తో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ శ్రీనివాసులు, సి - బ్యాచ్ ఇంచార్జి మురళీ కృష్ణ, ప్రైమరీ ఇంచార్జి సుధా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని భవిష్యత్తులో మరెన్నో విజయాలను అందుకోవాలని విద్యార్థులను అభినందించారు.

## మాదకద్రవ్యాలపై యుద్ధానికి 'దండి మార్చ్ 2.0'

**- డ్రగ్స్ రహిత ఏపి లక్ష్యంగా విద్యార్థులతో సమరశంఖం**

**- తిరుపతి జిల్లాలో భారీ అవగాహన సదస్సులు**



**సూళ్లూరుపేట, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ దృఢ సంకల్పంలో భాగంగా తిరుపతి జిల్లా పోలీస్ యంత్రాంగం ఒక బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించింది. 'దండి మార్చ్ 2.0 డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' నినాదంతో, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా 1,10,000 మంది విద్యార్థిని విద్యార్థులతో భారీ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సూళ్ళూరుపేట సర్కిల్ పరిధిలోని 31 పాఠశాలలు, కళాశాలల నుండి 7,000 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సదస్సులో నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో సూళ్ళూరుపేట సీఐ మురళీకృష్ణ, సూళ్ళూరుపేట ఎస్సై అజయ్ కుమార్ పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సూళ్ళూరుపేట సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ, నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గంజాయి ఇతర మత్తు పదార్థాల వాడకంవల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, ఆర్థిక అనర్థాలను వివరిస్తూ, విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోకుండా క్రమశిక్షణతో మెలగాలని పిలుపునిచ్చారు.డిజిటల్ మాధ్యమం ద్వారా జరిగిన ఈ సదస్సులో ఐజీ ఆకే రవికృష్ణ , కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు మాదకద్రవ్యాల ముప్పును వివరించారు. డ్రగ్స్ రహిత రాష్ట్రం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థలు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని అధికారులు సూచించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ భారీ అవగాహన కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన విద్యా సంస్థల యాజమాన్యాలకు ధన్యవాదాలు తెలియజేశారు.

## పట్టణ రోడ్లన్నీ చిత్తుచిత్తు

**నాయుడుపేట, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని రోడ్లన్నీ గుంతలతో చిత్తు చిత్తు అయ్యాయని సిపిఎం పార్టీ నాయకులు శివకవి ముకుంద ఆరోపించారు. సిపిఎం, సిఐటియు నాయకులు కలిసి పాత శివాలయం రోడ్డుపై ప్రమాద హెచ్చరిక బోర్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో కొద్దిపాటి వర్షానికే పట్టణ రోడ్లన్నీ గుంతల మయమై చిత్తుచిత్తుగా మారి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నా పట్టించుకోని అధికారుల నిర్లక్ష్య వైఖరిపై నాయకులు సోమవారం ప్రమాద హెచ్చరిక బోర్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ మున్సిపాలిటీలో రోడ్లను గ్యాస్ పేరుతో ఎక్కడపడితే అక్కడ ధ్వంసం చేసి రోడ్లను నిర్లక్ష్యంగా వదిలేయడంతో సోమవారం తెల్లవారుజామున కురిసిన కొద్దిపాటి వర్షానికి గుంతల్లో నీళ్లు నిలబడి రోడ్లు ప్రమాదకరంగా మారినా మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. పట్టణంలోని అగ్రహార పేట, ట్రెజరీ, మున్సిపాలిటీ, పాత శివాలయం రోడ్లు పై వాహనదాలు ప్రయాణించాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారని, ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి ప్రజల సమస్యలు తీర్చవలసిన అవసరం వుందన్నారు. సకాలంలో చర్యలు తీసుకోక పోతే ప్రజలను కలుపుకొని మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సిపిఎం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ ఆఫీజ్ అబ్దుల్లా, రాయపాటి. నరేష్, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగా ప్రసాద్ జన్మదిన వేడుకలు

**సూళ్లూరుపేట,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ పారిశ్రామికవేత్త, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు కొండేపాటి గంగా ప్రసాద్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసంలో జరిగిన ఈ వేడుకలకు పలు వురు ఎమ్మెల్యే లు, కార్యకర్తలు అభిమానులు హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గంగా ప్రసాద్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని పలువురు కోరారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజాసేవలో ముందుండాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట, గూడూరు, సత్యవేడు, వెంకటగిరి ఎమ్మెల్యే లు నాయుకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**నాయుడుపేట, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట మండలం రూరల్ బిజెపి కార్యాలయంలో సోమవారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బిజెపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం బిజెపి సీనియర్ నాయకులు ఏవిఎస్ రవీంద్ర మాట్లాడుతూ 1980 ఏప్రిల్ 6వ తేదీన భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించిందని తెలిపారు.నేటికి 46 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తిరుపతి జిల్లా నాయుడుపేట రూరల్ మండలం కార్యాలయం వద్ద నాయకులు జెండా ఆవిష్కరించి స్వీట్లు పంచుకున్నట్లు తెలిపారు.మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపాయి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని మూడు సార్లు ప్రధానమంత్రిగా పరిపాలన సాగించారని, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడు సార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారని తెలిపారు. 2014 నుండి తిరుగులేని నాయకుడిగా అనేక అభివృద్ధి పనులు చేస్తూ భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. నాయుడుపేట రూరల్ మండలం సీనియర్ నాయకులు రవి, గురు ప్రసాద్ రాజు, వేణయ్య, సుబ్బారావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# రూ.14 వేల కోట్లతో పుర, నగరపాలకల్లో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్

**- అత్యధిక, మధ్యస్థ జనాభా ఉన్న ప్రాంతాల్లో కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత - నగర, పురపాలకల్లో ఎస్టీపీల నిర్మాణానికి రూ.39.21కోట్లు**
**- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి డాక్టర్ పీ నారాయణ**



**చిత్తూరు, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలోని పుర, నగరపాలక సంఘాల పరిధిలో ప్రతి ఇంటికి కొళాయి ద్వారా నీటి సరఫరా చేస్తామని, ఇందుకోసం రూ.14 వేల కోట్లతో పనులు జరుగుతున్నాయని పురపాలక, పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ చెప్పారు. సోమవారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ కుమార్, ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ప్రభాకర్ రావు, కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారి సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ బి శ్రీనివాస్ లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ప్రకారం.. పుర, నగరపాలక సంస్థల్లో ప్రాధాన్యత క్రమంలో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. చిత్తూరు నగరంలో రహదారుల విస్తరణ పనులు చక్కగా జరుగుతున్నాయని కితాబిచ్చారు. భవిష్యత్తు అవసరాలు, ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రోడ్లను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగర, పురపాలక సంఘాల్లో నీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, యూస్డ్ వాటర్, రోడ్లు, లైట్లు, పార్కులు ఇతర ప్రాధాన్యత క్రమంలో పనులు చేస్తున్నట్లు చెప్పారు. అమృత్, యుఐడీఎఫ్ నిధులతో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ అందించే పనులు వేగంగా జరుగుతుందన్నారు. మురుగునీటి నిర్వహణలో భాగంగా 123 పుర, నగర పాలక సంస్థల్లో ఎస్.టి.పి (సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) లను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం రూ.39.21 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పుర, నగరాల్లో జనాభా ప్రాతిపదికన మురికినీటి కాలువల నిర్మించేందుకు రూ.29వేల కోట్లతో డిపిఆర్ సిద్ధం చేశామని.. మొదటగా అత్యధిక, మధ్యస్థ జనాభా కలిగిన ప్రాంతాల్లో రూ.9వేల కోట్లతో కాలువల నిర్మించేందుకు నిధులు కేటాయించడం జరిగిందని, రెండు మూడు నెలల్లో టెండర్ ప్రక్రియలు పూర్తి చేస్తామన్నారు. ఇందులో భాగంగా చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో కాలువల నిర్మాణానికి రూ.82 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వైకాపా ప్రభుత్వం ప్రజలపై చెత్తపన్ను వేసి, డంపింగ్ యార్డులో చెత్తకుప్పలు అలానే వదిలేసి వెళ్లిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేరుకుపోయిన 153 లక్షల టన్నుల లెగసి వేస్ట్ ను తొలగించే పనులు జోరుగా జరుగుతున్నాయని మే నెలాఖరుకు పూర్తిచేసేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని.. తిరుపతిలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చిందన్నారు. ఈ నిర్మాణం అందుబాటులోకి వస్తే చిత్తూరులో ఉత్పత్తి అయ్యే రోజువారి వ్యర్థాలను అక్కడికి తరలించడం ద్వారా వ్యర్థాలు నిల్వచేరదన్నారు. ఇటీవల టిట్కో గృహాలను ప్రారంభించి, లబ్ధిదారులకు అందించడం జరిగిందని జూన్ నాటికి మరో నలభై వేల గృహాలను పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల ఎల్ఈడి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నామని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వీటిని నిర్వహిస్తామన్నారు. నగర, పురపాలక సంఘాలు ఆదాయం పెంచుకోవడంపై దృష్టి సారించాలని. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసి అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతులను వేగవంతం చేయడం ద్వారా భవన నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలను వృద్ధి చేసి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్, బిఆర్ఎస్ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంచాలన్నారు. రెవెన్యూ టాక్స్ ల వసూలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధానంగా టాక్స్ పరిధిలోకి రాని వాటిని గుర్తించడం, తక్కువ టాక్స్ చెల్లిస్తున్న వారిని గుర్తించి వసూళ్లు చేయాలన్నారు. గత ప్రభుత్వం మున్సిపల్ టాక్స్ నిధులను పక్కదారి పట్టించిందని.. ఈ ప్రభుత్వం వచ్చాక మున్సిపల్ టాక్స్ మున్సిపల్ ఖాతాలోనే ఉండేలా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

అధికారులందరూ సమన్వయంతో పనిచేసి స్థానికంగా ఆదాయం పెంచుకోవడం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలని పిలుపునిచ్చారు. సీడీఎంఏ సంపత్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నగర, పరిపాలక సంఘాల్లో సమస్యలను స్వయంగా గుర్తించి వాటి పరిష్కారానికి సరైన మార్గాలను సూచించడం కోసమే మంత్రి ఆధ్వర్యంలో అన్ని యుఎల్బీలలో పర్యటిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి, మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్రంలో ట్యాక్స్ పెంచకుండానే.. గత ఏడాదికంటే 20 శాతం అదనపు ఆదాయం పెంచడం జరిగిందన్నారు. డోర్ టు డోర్ వెరిఫికేషన్ ద్వారా పన్ను పరిధిలోకి రాని వాటిని గుర్తించి పన్నులు వసూలు చేయడం, మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందుతున్నట్లు చెప్పారు. ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ.. అమృత్ 2, యూఏడిఎఫ్ ద్వారా కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. చిత్తూరులో ఎస్టీపీ నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్, నగర పాలక ప్రత్యేక అధికారి సుమిత్ కుమార్ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో నగరంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు జోరుగా జరుగుతున్నాయన్నారు. ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మార్కెట్ యార్డులో గుర్తించడం జరిగిందని, త్వరలోనే స్థలం అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అడవిపల్లి నుంచి నీటి సరఫరా పనులు మరో ఆరు నెలల్లో పూర్తి అవుతుందని చెప్పారు. అమృత్ పథకంలో భాగంగా తీసుకున్న రుణానికి సంబంధించి నగరపాలక సంస్థ ప్రతి సంవత్సరం రూ.18 కోట్ల మేర వడ్డీ చెల్లిస్తోందని, వడ్డీని మినహాయించడం ద్వారా ఆ నిధులతో అభివృద్ధి పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి గారిని కోరారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. నగరంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఇందుకోసం అవసరమైన నిధులు మంజూరు చేయాలన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగంగా చేపట్టడానికి వీలుగా "ప్రత్యేక ప్యాకేజీ" కేటాయించేలా ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి గారిని కోరారు. నగరపాలక సంస్థలో ఉద్యోగుల స్థాయిని కార్పొరేషన్ స్థాయికి పెంచాలన్నారు. కమిషనర్ పి నరసింహప్రసాద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. కలెక్టర్, ఎమ్మెల్యే సహకారంతో నగరంలో రోడ్ల విస్తరణ పనులు జరుగుతున్నాయని, బస్టాండ్ రోడ్డును మోడల్ రోడ్డుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. 15 వ ఆర్థిక సంఘం నిధులతో కాలువల నిర్మాణం చేపడుతున్నామని, రూ.75 కోట్లతో లైట్లు, డ్రైవింగ్లో నిర్మాణానికి సంబంధించి అంచనాలు తయారు చేసినట్లు చెప్పారు. మినీ పార్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, రెవెన్యూ డిమాండులో 69 శాతం మేర పన్నులు వసూలు చేసినట్లు వివరించారు. తొలుత మురుకంబట్టు వద్ద మంత్రికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం సంతపేటలోని నగరపాలక సంస్థ డంపింగ్ యార్డ్ ను మంత్రి పరిశీలించారు. వేస్ట్ ప్రాసెసింగ్ జరుగుతున్న తీరును అధికారులు అడిగి తెలుసుకున్నారు. మే నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంతపేట, కట్టమంచి, సాంబయ్య కండిగ, కొంగారెడ్డిపల్లి, ఫారెస్ట్ రోడ్డు, గిరింపేట, ఇరువారం, పలమనేరు రోడ్డు, దర్గా సర్కిల్ మీదుగా రోడ్ల విస్తరణ పనులను పరిశీలించారు. పూణేపల్లి వద్ద టిడ్కో గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ మేయర్ ఎస్ అముద, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా



## అనాధ వృద్ధులకు దుస్తుల పంపిణీ



**చిత్తూరు, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక "అమ్మ ఒడి" అనాధాశ్రమం లోని అనాధ వృద్ధులకు బట్టలు పంపిణీ చేశారు. ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ అనాధ వృద్ధులైన అవ్వతాతల కోసం సోమవారం హృదయ పూర్వక సేవా కార్యక్రమం నిర్వహించారు. 70 మంది వృద్ధులకు చీరలు, పంచలు, టవళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని సంస్థ రాష్ట్ర అధ్యక్షులు జన్నావుల సురేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మ ఒడి ట్రస్ట్ చైర్మన్ పద్మనాభనాయుడు, సభ్యులు వెంకటరమణ, రెడ్డప్ప, జయచంద్ర, చిట్టిబాబు, శంకరనాయుడు, వేణుగోపాల్ నాయుడు, పవన్ కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జన్నావుల సురేంద్ర మాట్లాడుతూ.... సమాజంలో వృద్ధుల ఆలనా పాలనా, సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యతని, వారి అండగా నిలవాలన్నారు. సేవాశ్రమం నిర్వాహకులు, ట్రస్ట్ చైర్మన్ పద్మనాభనాయుడు మాట్లాడుతూ... ఇలాంటి సేవా కార్యక్రమాలు తరచుగా నిర్వహించి మరింత మందికి సహాయం అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం వృద్ధుల్లో ఆనందం నింపగా, సేవా భావంతో ముందుకు వచ్చిన ఆర్టిఐ ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ ప్రతినిధులను ఆశ్రమ నిర్వాహకులు అభినందించారు.

## వడదెబ్బ నియంత్రణపై మండలస్థాయి సమావేశం



**పులిచెర్ల,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వడదెబ్బ నియంత్రణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పులిచెర్ల మండల టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజశేఖర్ బాబు మాట్లాడుతూ వడదెబ్బపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, అవసరమైన చోట చలివేంద్రాల ద్వారా తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తాహసిల్దార్ జయసింహ మాట్లాడుతూ మండలంలో ఎవ్వరూ వడదెబ్బ బారిన పడకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎల్లంకివారి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యల్లయ్య మాట్లాడుతూ ప్రజలు సన్నని, వదులుగా, లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలు ధరించడం మంచిదని, సూర్యరశ్మికి నేరుగా బహిర్గతమయ్యే సమయంలో గొడుగు, టోపీ, టవల్, ఇతర సాంప్రదాయ తలపాగాను ఉపయోగించాలన్నారు. తగినంత నీరు తాగాలన్నారు. చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, ఆరు బయట పనిచేసే వ్యక్తులు, శారీరకంగా అనారోగ్యంతో ఉన్న వారు, గుండె జబ్బులు లేదా అధిక రక్తపోటు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆల్కహాల్, టీ, కాఫీ, శీతల పానీయాలు లేదా పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలను సేవించరాదన్నారు. పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకోసం అన్నిచోట్ల ఓ.ఆర్.యస్. పాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలలో తగినంత తాగునీరు, ఓ.ఆర్.యస్. ప్యాకెట్లు, ప్రథమ చికిత్స సామాగ్రి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసి, ఉపాధి హామీ ఏ.పి.ఓ. కి ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించి, వడదెబ్బపై గోడపత్రికలు ఇతర ప్రచార సామాగ్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, మండల విద్యాశాఖాధికారి-2 పోకల తాతయ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయలక్ష్మి, ఉపాధి హామీ ఏపీవో సౌభాగ్యం, ఆరోగ్య విస్తరణాధికారులు చంద్రయ్య, కృష్ణయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు పురుషోత్తం పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవం



**చిత్తూరు,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతీయ జనతా పార్టీ 46 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను చిత్తూరు నగరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మిట్టూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో, కొండమిట్టలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక కట్టుకాలువ వీధిలో చిత్తూరు సెంటర్ మండల బిజెపి అధ్యక్షులు, 37 వ డివిజన్ బిజెపి ఇంచార్జ్ షణ్ముగం ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన పార్టీ శ్రేణులు, పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు జగదీశ్వరనాయుడు మీడియాతో మాట్లాడుతూ ... మన ఊరు - మన జెండా నినాదంతో ఈ ఏడాది జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో బిజెపి పతాకాలను ఆవిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. వికసిత్ భారత్ ద్వారా అనేక మంది పేద, బడుగు, బలహీన వర్గాలకు అన్ని రకాల ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్న ఏకైక పార్టీ బిజెపి అన్నారు. దేశ ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షులు, నితిన్ నబీ, రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆధ్వర్యంలో అటు దేశం, ఇటు ఆంధ్రప్రదేశ్ అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తోందన్నారు. ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో 20 వేల కోట్ల రూపాయలతో నాలుగు జాతీయ రహదారులను నిర్మించడం జరిగిందన్నారు. నాలుగు మెట్రోపాలిటన్ నగరాలకు కనెక్టివిటీ గల జిల్లాగా చిత్తూరు నిలవడం గర్వకారణం అన్నారు. ఇకపైన కూడా భారతీయ జనతా పార్టీకి ఆదరాభిమానాలు అందించాలని ఆయన ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, రాష్ట్ర నాయకులు డాక్టర్ బాబు, జిల్లా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కె చిట్టిబాబు, పార్టీ నాయకులు కరుణాకర్ సిద్ధు, రామభద్ర, సురేష్, షంషేర్, గోకుల్ యాదవ్, రెడ్డిమస్తాన్, హేమంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## విలేకరి రెడ్డి ప్రసాద్ కుటుంబీకులను పరామర్శించిన ఎమ్మెల్యే అమర్



**పెద్దపంజాణి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పెద్దపంజాణి మండల విలేకరి రెడ్డి ప్రసాద్ కుటుంబీకులను పలమనేర్ శాసనసభ్యులు అమరనాథ రెడ్డి సోమవారం పరామర్శించారు. పెద్దపంజాణి మండల ప్రెస్క్లబ్ అధ్యక్షులుగా పనిచేస్తున్న రెడ్డిప్రసాద్ తల్లి అనసూయమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసివెళ్లి ఆమె భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెడ్డి ప్రసాద్ తో పాటు వాళ్ళ కుటుంబీకులు పరామర్శించి తమ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు టిడిపి నాయకులు గిరిబాబు, కోటేశ్వర్, సురేష్, రమేష్, సుబ్బు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

## హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి : ఎమ్మెల్యే



**పలమనేరు, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేర్ పట్టణంలోని మదర్ తెరిసా విద్యాసంస్థల ఆడిటోరియంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కళాశాలలోని సిబ్బందికి విద్యార్థులకు, విలేకరులకు హెల్మెట్లు పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించారు. 450 మందికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ.... ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలని దీనివలన ప్రమాదాలను నివారించవచ్చును. రోడ్డు భద్రతకు ఇది ఒక్కటే ముఖ్యమని అతివేగం మంచిది కాదన్నారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్, గంగవరం సీఐ రాంభూపాల్ మాట్లాడుతూ... ఈ మధ్యకాలంలో చాలామంది వాహనాలు అతివేగంగా నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, డ్రైవింగ్ సమయంలో ప్రతి ఒక్కరూ కుటుంబాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. కుటుంబ పెద్ద ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడుతుందన్నారు. దీనిని గుర్తు పెట్టుకొని డ్రైవర్లు వాహనాలు నిదానంగా నడపాలన్నారు. కార్యక్రమంలో పలమనేరు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్, గంగవరం సీఐ రాంభూపాల్, కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ ఎంఆర్ సునీల్, డైరెక్టర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి, మధుసూదన్ రావు, దివాకర్ రెడ్డి, విద్యార్థిని విద్యార్థులతోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

## నమ్మదగ్గ రియల్ ఎస్టేట్ ప్రతినిధుల వద్దనే ఆస్తుల విక్రయాలు చేయండి

**- చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచన**



**చిత్తూరు, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నమ్మదగ్గ రియల్ ఎస్టేట్ ప్రతిదుల వద్దనే ఆస్తుల క్రయ, విక్రయాలను సాగించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సూచించారు. చిత్తూరు నగరంలో రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి మరో అడుగు పడింది. సరస్వతి, వరలక్ష్మి, రాజ్యలక్ష్మి ( ఎస్వీఆర్ ) రియల్ ఎస్టేట్, బిల్డర్స్ అండ్ డెవలప్మెంట్ సంస్థ తమ నూతన కార్యాలయాన్ని అన్ని హంగులతో ఏర్పాటు చేసింది. నగరంలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్ సమీపంలోని ఏఎస్ఎమ్ మున్సిపల్ కాంప్లెక్స్లో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయాన్ని సోమవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుభారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న చిత్తూరు నగరంలో నాణ్యమైన నిర్మాణ సేవలు అందించే సంస్థల అవసరం ఎంతో ఉందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్లాట్ల క్రయ, విక్రయాలు, ఆధునిక సదుపాయాలతో గృహ నిర్మాణాలు చేపట్టడం ద్వారా నగర అభివృద్ధికి ఎస్వీఆర్ సంస్థ తోడ్పడాలని ఆకాంక్షించారు. నాణ్యత, నమ్మకం, పారదర్శకతతో సేవలందిస్తే ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చని సూచించారు. ఎస్వీఆర్ సంస్థ నిర్వాహకులు మౌళి మాట్లాడుతూ... ఎస్వీఆర్ రియల్ ఎస్టేట్ ద్వారా బెంగళూరు తరహాలో ఆధునిక ప్రమాణాలతో సేవలు అందించడమే తమ లక్ష్యమన్నారు. చిత్తూరు ప్రజలకు అందుబాటు ధరల్లో ప్లాట్లు, గృహ నిర్మాణం, భవనాల మరమ్మతులు, ఇంటీరియర్ పనులు, ఇతర అన్ని రకాల సేవలను ఒకే వేదికపై అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.కస్టమర్ల అవసరాలను ప్రాధాన్యంగా తీసుకొని పారదర్శక విధానాలతో సేవలు అందించడం తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. నగరంలో పెరుగుతున్న రియల్ ఎస్టేట్ డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతికతతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు పనులు చేపట్టండి

**- మహిళలు డిమాండ్**



**పుంగనూరు, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ పరిధిలోని కట్టక్రింద పాల్యం ప్రజలు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరు కట్టమీద నుండి బెంగళూరుకు వెళ్లే జాతీయ రహదారి అధ్వాన్నంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోడ్డు తవ్వి కంకర వేసి నెలలుగా వదిలేయడంతో దుమ్ము, ధూళి అధికంగా ఎగిసి ఇళ్లలోకి చేరుతున్నదని, రహదారిపై వాహనాలు వెళ్లినప్పుడల్లా దుమ్ము మబ్బుల్లా ఎగిసి పరిసర ప్రాంతాలను కమ్మేస్తోంది. దీనివల్ల చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు వంటి రోగాలకు గురవుతున్నారని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి రహదారి పనులను ప్రారంభించి పూర్తి చేయాలని కోరుకుంటున్నామన్నారు.

## మేలుపట్లలో వైభవంగా సీతారాముల ఊరేగింపు



**పుంగనూరు, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని మేలుపట్ల గ్రామంలో రాత్రి శ్రీ సీతారామ సమేత శ్రీరాములవారి పుషప్పల్లకి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయంలో శాస్త్ర పద్ధతిలో శ్రీ సీతారాముల కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం పుష్పాలతో అలంకరించిన పల్లకిపై స్వామివారిని ఆసీనులుగా ఉంచి గ్రామ వీధుల్లో మంగళ వాయిద్యాల చెక్కభజనలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో అడుగడుగునా మహా మంగళహారతులు సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో దొరబాబు, రోహిత్ రెడ్డి ,హరి, పవన్ మంజ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి





**పలమనేరు , ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన సంఘటన గంగవరం వైయస్సార్ సర్కిల్ వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఎలా... గంగవరం మండలంలోని వైయస్సార్ జంక్షన్ వద్ద సోమవారం వేకు జమున బెంగళూరు నుండి తిరుపతికి కారులో 6 మంది వస్తుండగా వీరి వాహనం ముందర తమిళనాడు నుండి తిరుపతి వైపు వెళుతున్న లారీ సడన్గా బ్రేక్ వీరి వాహనం తగిలి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఫీల్డ్ అసిస్టెంట్ హరీష్ (36) కోర్ట్ జూనియర్ అసిస్టెంట్ యుగంధర్( 47) మృతి చెందినారు. మిగిలిన నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతులను వారిని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి కుటుంబీకులకు అప్పగించారు. ఈ విషయం తెలిసిన వెంటనే గంగవరం పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గోవులకు పశుగ్రాసం విరాళం

**పలమనేరు,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు రూరల్ మండలంలోని జగమర్ల పంచాయతీ పరిధిలోని దేవళం పెంట గోశాలకు శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ డాక్టర్ మురుగన్ విరాళంగా యిచ్చారు. తమిళనాడు నుండి తెప్పించిన ఒక లోడ్ పశుగ్రాసాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీ పార్వతి సమేత శ్రీ వందన మల్లేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహిస్తున్న స్వామి మాట్లాడుతూ... డాక్టర్ మురుగన్ ను తాము గోవులకు గ్రాసం కావాలని కోరగా, స్పందించి ఒక లోడ్ పశుగ్రాసాన్ని అందించారన్నారు. దాత మురుగన్ కు స్వామి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇంటి వద్దే కిడ్నీ చికిత్స - పెరిటోనియల్ డయాలిసిస్ పై అవగాహన అవసరం

**-మూత్రపిండ వైఫల్య రోగులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రత్యామ్నాయం**

**-స్విమ్స్ నెఫ్రాలజీ విభాగాధిపతి డా॥ రామ్ వెల్లడి**

**తిరుపతి,ఏప్రిల్ 6(నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమల– తిరుపతి దేవస్థానముల నిర్వహణ లోని శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) పెరిటోనియల్ డయాలిసిస్ సేవల్లో జాతీయ స్థాయిలో ప్రముఖ స్థానం సంపాదించింది. ఇక్కడ పెద్ద సంఖ్యలో రోగులకు విజయవంతంగా చికిత్స అందించడమే కాకుండా, పిల్లల (పిడియాట్రిక్స్) కిడ్నీ వ్యాధుల నిర్వహణలో ప్రత్యేక నైపుణ్యం పొందిన వైద్యులు ఉన్నారని నెఫ్రాలజీ విభాగాధిపతి డా॥ రామ్ వెల్లడించారు. మూత్రపిండాల వైఫల్యం ప్రస్తుతం పెరుగుతున్న ప్రధాన ఆరోగ్య సమస్యలలో ఒకటి. మూత్రపిండాలు మన శరీరంలో రక్తాన్ని శుభ్రపరచే ముఖ్య అవయవాలు కిడ్నీలు సరిగా పనిచేయకపోతే శరీరంలో విషపదార్థాలు పేరుకుపోయి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఈ పరిస్థితిని క్రానిక్ కిడ్నీ డిసీజ్ అంటారు. ఈ దశలో డయాలిసిస్ అనివార్యం అవుతుంది. ఈ పరిస్థితిలో శరీరంలోని మలినాలు, అదనపు ద్రవాలు తొలగించేందుకు డయాలిసిస్ తప్పనిసరి అవుతుంది. హీమోడయాలిసిస్ కు ప్రత్యామ్నాయంగా పెరిటోనియల్ డయాలిసిస్ (పిడి) ఇప్పుడు సమర్ధవంతమైన మరియు సౌకర్యవంతమైన చికిత్సగా గుర్తింపు పొందుతోంది.

**పెరిటోనియల్ డయాలిసిస్ అంటే.....**

పెరిటోనియల్ డయాలిసిస్ (PD అనేది ఒక ఆధునిక చికిత్సా విధానం. పొట్టలోని పెరిటోనియం అనే సహజ పొరను ఫిల్టర్ ఉపయోగించి రక్తంలోని వ్యర్థాలను తొలగిస్తారు. ముఖ్యంగా ఈ చికిత్సను రోగులు తమ ఇంటి వద్దే నిర్వహించుకోవచ్చు.

**ఇది ఎలా పనిచేస్తుంది?**

ఈ విధానంలో ముందుగా చిన్న శస్త్రచికిత్స ద్వారా పొట్టలో ఒక సన్నని ట్యూబ్ (కాథెటర్) అమర్చబడుతుంది. 1–2 వారాల తర్వాత చికిత్స ప్రారంభిస్తారు. రోగికి మరియు కుటుంబ సభ్యులకు శిక్షణ ఇవ్వబడుతుంది. ఆ ట్యూబ్ ద్వారా ప్రత్యేక ద్రవాన్ని లోపలికి పంపించి కొంతసేపు (4–6 గంటలు) నిల్వ ఉంచుతారు. ఈ సమయంలో రక్తంలోని వ్యర్థాలు ఆ ద్రవంలోకి చేరతాయి. తరువాత ఆ ద్రవాన్ని బయటకు తీసి మళ్లీ కొత్త ద్రవాన్ని ప్రవేశపెడతారు.

**పెరిటోనియల్ డయాలిసిస్ రకాలు:**

1.సిఏపిడి: రోజుకు 3–4 సార్లు పేషంట్ స్వయంగా చేయాలి.ఎక్కడైనా చేయగలిగే సౌలభ్యం,

2.ఏపిడి: ఇది రాత్రి యంత్రం సహాయంతో జరుగుతుంది. పగటిపూట స్వేచ్ఛగా పనులు చేసుకోవచ్చు

**ముఖ్య ప్రయోజనాలు :**

ఇంటి వద్దే చికిత్స వల్ల ఆసుపత్రి సందర్శనలు తగ్గుతాయి, రోగి స్వతంత్రంగా జీవించగలడు, హృదయంపై తక్కువ ఒత్తిడి, రక్తపోటు స్థిరంగా ఉంటుంది, పిల్లలు మరియు వృద్ధులకు అనుకూలం

జాగ్రత్తలు

ప్రతి సారి చేతులు శుభ్రంగా కడగాలి, మాస్క్ ఉపయోగించడం మంచిది, కాథెటర్ ప్రాంతం పరిశుభ్రంగా ఉంచాలి. స్టెరైల్ టెక్నిక్ తప్పనిసరి, డాక్టర్ చెప్పిన విధంగా మాత్రమే చేయాలి

**పెరిటోనియల్ డయాలిసిస్ మరియు హిమోడయాలసిస్ మధ్య వ్యత్యాసం**

పెరిటోనియల్ డయాలిసిస్ ప్రతిరోజూ ఇంట్లో ఎక్కువ సమయం, తక్కువ ఖర్చుతో చేసుకోవచ్చు.హిమోడయాలసిస్ హాస్పిటల్లో వారానికి రెండు నుండి మూడుసార్లు తక్కువ సమయంలో ఎక్కువ ఖర్చుతో చేస్తారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న డా॥ ఎన్.టి.ఆర్. వైద్య సేవ పథకం ద్వారా మరియు టి.టి.డి. ఆధ్వర్యంలో ప్రాణదాన ట్రస్టు మరియు భారత ప్రభుత్వం వారి రాష్ట్రీయ ఆరోగ్య నిధి ద్వారా ఉచితంగా చికిత్సలు నిర్వహించడం జరుగుతున్నది.ఈ పథకాల ద్వారా దాదాపు ఒక పేషంట్ కు 10 లక్షలు వరకు ఉచితంగా చికిత్స చేయడం జరుగుతుంది.తాత్కాలిక మూత్రపిండాల వైఫల్యం, మరియు చివరి దశ కిడ్నీ వ్యాధి, క్రానిక్ కిడ్నీ డిసీజ్కు, గురైన చిన్నపిల్లలు, వృద్ధులకు మరియు హీమోడయాలిసిస్ కు అనుకూలం కాని రోగులుకు ఈ విధానం ఎంతో ఉపయోగకరం. రీనల్ ఫెయిల్యూర్ అయిన పిల్లలకు హీమోడయాలిసిస్ చేయరాదు. పిల్లలకు కావాలసిన హీమో డయాలిసిస్ మిషన్లు ఇండియాలో తయారు కాబడలేదు. కావున రీనల్ ఫెయిల్యూర్ వచ్చిన పిల్లలకు పెరిటోనియల్ డయాలిసిస్ ఒక్కటే మార్గం. స్విమ్స్ నెఫ్రాలజీ విభాగంలో అతి పిన్న వయస్సు కలిగిన 45 రోజులు పసికందు మరియు 90 యేళ్ల వృద్ధులకు ఈ పెరిటోనియల్ వైద్యం అందించడం జరిగింది. ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా, రోగులు సరైన సమయంలో సరైన చికిత్సను ఎంచుకునే అవకాశం ఉంటుందని నెఫ్రాలజీ విభాగాధిపతి డా॥ రామ్ తెలియజేశారు.స్విమ్స్ లో ప్రతిరోజు నెఫ్రాలజీ విభాగం లో అడ్మిషన్లు ఉంటాయి.ప్రతి రోజు సుమారు 110 మంది ఇన్ పేషంట్స్ గా వివిధ మూత్రపిండాల వ్యాధులకు చికిత్స పొందుతున్నారు. రోజుకు సగటున 20 మంది కొత్త అడ్మిషన్లు జరుగుతున్నాయి.

## బోయకొండ పక్షిరాజుపురం అడవిలో వ్యక్తి దారుణ హత్య...?



**చౌడేపల్లి,ఏప్రిల్ 6(నేటి మనదేశమ్ ప్రతినిధి):** బోయకొండ సమీపంలోని పక్షిరాజుపురం కు సమీపంలోని అడివిలోవ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన వెలుగు చూసింది. తమిళనాడు రాష్ట్రం గుడియాతం కు చెందిన గాంధీ 35 అతని కుమారుడు సందీప్ 4 లు 20 రోజుల క్రితం బోయకొండ సమీపంలోని ఆర్ఆర్ కాలనీలో నివాసముండే తన భార్య రఫాతి ని సొంత గ్రామానికి తీసుకెళ్లేందుకు వచ్చారు. అయితే అప్పటికే ఆర్ఆర్ కాలనీకి చెందిన నర్సిమ్ములుతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్న రఫాతి భర్త గ్రామానికి వెళ్లేందుకు నిరాకరించింది దీంతో 20 రోజులుగా ఇక్కడే ఉన్నట్లుగా స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో నరసింహులు అతని స్నేహితులతో కలిసి గాంధీని అతని కుమారుడు సందీప్ లను ఆదివారం రాత్రి పక్షిరాజుపురం అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లినట్లుగా స్థానికులు తెలిపారు. ఉదయం సందీప్ పక్షిరాజు పురం లోని అంగన్వాడి కేంద్రం కు వచ్చి తన తండ్రిని కొట్టారని చూపిస్తాను అంటూ వారిని తీసుకెళ్లి చూపించగా అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించిన అంగన్వాడి టీచర్ స్థానిక పోలీసులకు సమాచారం అందించారు అంజన్న వెంటనే పుంగునూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్ ఎస్సై చిన్న రెడ్డప్ప లు సంఘటన స్థలాన్ని చేరుకున్నారు. చుట్టుపక్కల వారిని విచారణ జరిపి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉండిలో దశాబ్దాల నీటి సమస్య తీరింది: డిప్యూటీ స్పీకర్

**ఉండి ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం వాంద్రం గ్రామంలో దశాబ్దాలుగా ఉన్న నీటి సమస్య తీరిందని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. సోమవారం ఆయన మంచినీటి చెరువు పూడిక తీత, చుట్టూ వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ పనులతో ఎన్నో ఏళ్ల నీటి సమస్య పరిష్కారమైందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకటకృష్ణ, ద్వారంపూడి నారాయణరెడ్డి, కూటమినాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

**: పార్టీ పథకాన్ని ఆవిష్కరించిన నాయకులు**



**భీమవరం ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భీమవరంలో భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, స్థానిక శ్యాంప్రసాద్ ముఖర్జీ సెంటర్ లో సీనియర్ నాయకులు ఆలమూరు మల్లికార్జున్ రావు గారి ఆధ్వర్యంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ పార్టీ పథకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోట గంగరాజు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు గాదిరాజు వెంకటేశ్వరరాజు, పట్టణ బిజెపి అధ్యక్షులు ఆడబాల శివ తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలు పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరంలో జరిగాయి.

## పాకిస్తాన్‌లో ఎంపాక్స్ కలకలం...

**శిశువుల మృతితో ఆందోళన**



**విజయవాడ ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పాకిస్తాన్‌లో ప్రమాదకరమైన ఎంపాక్స్ వైరస్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. తాజాగా ఏడుగురు శిశువులు మృతి చెందగా, వారిలో నలుగురికి ఎంపాక్స్ సోకినట్లు నిర్ధారణ అయింది. సింధ్ ప్రావిన్స్‌లోని ఖైర్‌పూర్ ప్రాంతంలో ఈ కేసులు వెలుగులోకి వచ్చాయని ఆరోగ్య శాఖ వెల్లడించింది. పుండ్లు, జ్వరం, ఫ్లూ లక్షణాలతో బాధపడుతున్న శిశువులను ఆసుపత్రుల్లో చేర్చగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. ఎంపాక్స్ వైరస్ సోకిన వ్యక్తులు లేదా జంతువులతో సన్నిహితంగా ఉంటే వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిశుభ్రత పాటించాలని సూచిస్తున్నారు.

## జగ్గయ్యపేటలో రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు

**-- మహిళల ఉత్సాహం ప్రత్యేక ఆకర్షణ...**



**నందిగామ ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ పోటీలకు పలు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నందిగామ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం ఎంతో శుభసూచకమని, ఇది సమాజంలో క్రీడలపై పెరుగుతున్న అవగాహనకు నిదర్శనమని ఆమె తెలిపారు స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ రాజగోపాల్ తాతయ్య పోటీ ప్రాంగణాన్ని సందర్శించి, అభ్యర్థుల భోజన, వసతి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించిన వెంకటరమణ తాతయ్యను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పోటీలు యువ క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపగా, స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. మొత్తంగా ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## ఘనంగా శ్రీ కోదండ రామాలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం



**బూర్జ ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం లక్కుపురంలో శ్రీ కోదండ రామాలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం శ్రీ అంపోలు రుద్రకోటేశ్వర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యలో ఘనంగా ప్రారంభమైంది. దీనిలో ముందుగా దేవతా మూర్తులను తిరువీధిగా మంగళ తాళాలతో, యువత, గ్రామస్థులు జయ జయ నినాదాలు చేస్తూ, మహిళలు ముగ్గురాటలతో ఆలయం వద్దకు చేరుకుని వేదమంత్రోచ్ఛరణ నడుమ దేవతా మూర్తులకు జలాభిషేకం నిర్వహించారు. రామనామంతో లక్కుపురం మారుమోగింది.

## చినగంజాంలో భాజపా ఆవిర్భావ వేడుకలు



**చినగంజాం ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భాజపా 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని చినగంజాంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల అధ్యక్షుడు ఉలిచి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఉలిచి ఏసుబాబు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు శిఖరం కోటయ్య, పర్చూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మెట్టు సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు అనుమాల శెట్టి శ్రీనివాసరావు, మండల జనరల్ సెక్రటరీ మోటమర్రి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఆ పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం మిఠాయిలు పంచారు.

## అకాల వర్షం రైతుల ఆశలపై నీళ్లు...

**నందిగామ పరిసరాల్లో ఉపశమనం -- ఆందోళన కలగలిపిన వాతావరణం...**



**నందిగామ ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కంచికచర్ల మరియు పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురవడంతో వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు సాయంత్రం నుంచి ప్రారంభమైన వర్షంతో కొంత ఉపశమనం పొందారు. వేడిగాలులతో ఉక్కిరిబిక్కిరైన వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఈ అకాల వర్షం రైతులకు మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా కంచికచర్ల మండలంలో విస్తారంగా సాగుచేస్తున్న మొక్కజొన్న, మామిడి పంటలు దెబ్బతినే అవకాశముందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే కోత దశలో ఉన్న పంటలకు ఈ వర్షం తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామిడి తోటల్లో పండ్లు ఊడిపోవడం, మొక్కజొన్న పొలాల్లో నీరు నిల్వ ఉండటం వల్ల దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. దీంతో రైతుల ఆశలు కొంత మేర దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. ఇక మరోవైపు, ఈ వర్షం తాగునీటి సమస్యను కొంతవరకు తగ్గించడంతో పాటు భూగర్భ జలాల మట్టాన్ని పెంచే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ అకాల వర్షం కారణంగా పంటలకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. మొత్తం మీద ఈ వర్షం ప్రజలకు ఉపశమనం ఇచ్చినా, రైతుల ఆశలపై మాత్రం నీళ్లు చల్లినట్టే అయింది. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

## గాదిరాజు రంగరాజు నాటక పరిశోధన గొప్పది: గాంధీబాబు రాజు



**ఉండి ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పశ్చిమ గోదావరి జిల్లా ఉండిలో సోమవారం జరిగిన రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సాధారణ సమావేశంలో, యూనియన్ జిల్లా నాయకులు అల్లూరి గాంధీబాబు రాజు మాట్లాడుతూ, డాక్టర్ గాదిరాజు రంగరాజు నాటక రంగంపై చేసిన పరిశోధన చాలా గొప్పదని ప్రశంసించారు. ఈ సమావేశంలో వీ.శివరాజు, వీ.ఉమా మహేశ్వరం, కళ్లేపల్లి వర్మ, వీ.గోపాలరాజు ఆనంద్, GV కృష్ణంరాజు, GV రామారావు, గ్రా.శ్యామలరావు, నెలబాలుడు, ఎ.ఆదినారాయణ, G.నాగేశ్వరరావు, ఖ.కృష్ణమూర్తి, ఖఎ.సత్యనారాయణ, పెద్దిరాజు, మార్కొండేయులు, చీ సత్యనారాయణ,గ్రా.డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగరాజును యూనియన్ నాయకులు సత్కరించారు.

## భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**మచిలీపట్నం ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మచిలీపట్నం భారతీయజనతా పార్టీ కార్యాలయంలో పండగ వాతావరణం లో జరిగిన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో తోలుత అధ్యక్షులు భారతీయ జనతా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు ,వక్తలు మాట్లాడుతూ 1980 సంవత్సరం ఏప్రిల్ 6 తేదీ నాడు ముంబై నగరం బాంద్రా ఏరియాలో 80 వేలమంది కార్యకర్తల సమక్షంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావం చాలా ఘనంగా జరిగి, అటల్ బిహారీ వాజపేయి ని ప్రథమ అధ్యక్షులు గా ఎన్నుకున్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు వాజ్ పాయ్ , లాల్ కృష్ణ అద్వానీ తదితర నాయకుల నాయకత్వంలో గ్రామీణ స్థాయి వరకు భారతీయ జనతా పార్టీ ఎంతో అభివృద్ధి చెంది వాజ్ పాయ్ మొదటి ప్రధాని గా అంత్యోదయ , స్వర్ణ చతుర్భుజి , రోడ్ , సాగర్, ఎయిర్ కనెక్ట్ వీలతో సుపరిపాలన అందించారన్నారు. గత పుష్కర కాలంగా ప్రధాని నరేంద్ర మోడీ భారత్ దేశాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తూ ప్రపంచ పటంలో అతి పెద్ద పార్టీగా దేశ రక్షణ ,మేకిన్ ఇండియా , అవినీతి రహిత సుపరిపాలన తో , ప్రపంచం లోనే 3వ ఆర్థిక శక్తిగా అగ్రభాగాన నిలిపారని, ఇది మనందరికీ గర్వకారణం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తాతినేని శ్రీ రామ్, నాయకులు రామినేని వెంకటకృష్ణ, కూనపరెడ్డి శ్రీనివాస్, వల్లూరి శ్రీమన్నారాయణ, పంతం గజేంద్ర, చలంచర్ల పద్మరాజు, జిల్లా నాయకులు వల్లూరిపల్లి రమణ, పోలన అశోక్, పుప్పాల రాము, పామర్తి రామకృష్ణ, తుంగల గిరి, గంటా సతీష్, వీరమల్లు అభినందన,సలాది రామకృష్ణ,సూరి శెట్టి హరికృష్ణ, ధూళిపాళ శ్రీ రామచంద్ర మూర్తి , వివిధ మోర్చల జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు తదితర మహిళా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యకే అధిక ప్రాధాన్యం..

**విద్యతోనే సమగ్ర అభివృద్ధి: ఎమ్మెల్యే**



**జలుమూరు ఏప్రిల్ 06( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జలుమూరు కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో అదనపు తరగతి గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్ తోనే రాష్ట్రం సమగ్ర అభివృద్ధి చెందుతుందని గుర్తించి కూటమి ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చి అనేక పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. శతశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

## డెకాయిట్ ఛాన్సుకి అదొక్కటే అడ్డంకి



ఎంత గ్యాప్ వచ్చినా పర్లేదు క్వాలిటీనే ముఖ్యమనే హీరో అడివి శేష్ కొత్త సినిమా డెకాయిట్ ఈ శుక్రవారం ఏప్రిల్ 10 థియేటర్లలో అడుగు పెట్టనుంది. ముందు రోజు ప్రీమియర్లు వేయాలా వద్దానే దాని మీద నిర్మాత సుప్రియ యార్లగడ్డ ఇంకా నిర్ణయం తీసుకోలేదని సమాచారం. కంటెంట్ మీద చాలా ధీమాగా అయితే ఉన్నారు. షానియేల్ డియో దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ కం ఎమోషనల్ డ్రామాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ కాగా భీమ్స్ సంగీతం సమకూర్చారు. ఇక అసలు విషయానికి వస్తే డెకాయిట్ కు చాలా సానుకూల వాతావరణం కనిపిస్తోంది. ఎందుకో చూద్దాం. మొన్న విడుదలైన బైకర్ మంచి టాక్ ఉన్నప్పటికీ మొదటి వీకెండ్ కే స్లగులవుతుండగా రాకాస దాని కన్నా కాస్త మెరుగ్గా వేగంగా బ్రేక్ ఈవెన్ వైపు వెళ్తోంది. అయితే ఈ రెండు యునానిమస్ టాక్ తెచ్చుకోలేదు. డీసెంట్ టాక్స్ తోనే రన్ అవుతున్నాయి. ఇంకా దూకుడు పెంచుతాయని అనుకోవడానికి లేదు. సో డెకాయిట్ కు శర్వా, సంగీత్ వల్ల వచ్చిన ఇబ్బంది అయితే లేదు. ఇక డెకాయిట్ తో పాటుగా అదే రోజు రెండు డబ్బింగ్ సినిమాలు వస్తున్నాయి. మొదటిది ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ. కృతి శెట్టి హీరోయిన్ కాగా విగ్నేష్ శివన్ దర్శకుడు. ఎందుకో కంటెంట్ పరంగా ఇది ఆడియన్స్ లో ఏమంత ఆసక్తి రేపలేకపోతోంది. టెక్నాలజీ ప్రపంచంలో ప్రేమకథలు ఎలా ఉంటుందనే పాయింట్ టచ్ చేసిన దర్శకుడు వాటిని ఎంత కన్విన్సింగ్ గా చూపిస్తారనేది ఫలితాన్ని శాసించనుంది. ఓపెనింగ్స్ వరకు ప్రదీప్ ఇమేజ్ పని చేస్తుంది. అర్థం కాని మలయాళం పేరు పల్లి చట్టంబిని టైటిల్ గా పెట్టుకుని వస్తున్న టోవినో థామస్ ఈసారి సీరియస్ ఇష్యూనే తీసుకున్నాడు కానీ నేటివిటీ పరంగా మనవాళ్లకు ఎంత కనెక్ట్ అవుతుందో చెప్పడం కష్టమే. కయదు లోహర్ హీరోయిన్ కావడం కొంత ప్లస్ అవుతోంది. అంచనాల పరంగా దీని మీద టాలీవుడ్ జనాలకు ఆసక్తి కలగాలంటే రిలీజ్ రోజు ఎక్స్ ట్రాడినరి టాక్ రావాల్సిందే. సో అన్ని రకాలుగా డెకాయిట్ కు మంచి గ్రౌండ్ దొరుకుతోంది. దాని మీద భారీ ఇన్నింగ్స్ ఆడటమే మిగిలింది. కాకపోతే డెకాయిట్ కు వచ్చిన చిక్కు ఒక్కటే. ఐపీఎల్ మంచి ఊపులో ఉంది. ఆ మేనియా నుంచి జనాన్ని బయటికి లాకొచ్చి థియేటర్లకు వచ్చేలా చేయడం అడివి శేష్ బృందానికి సవాలే.

## అవును... కళ్యాణ్ రామ్ సరసన ఆమెనే



అనిల్ రావిపూడి సినిమాలో ఛాన్స్ అంటే తెలుగులో అంతకుమించిన బంపరాఫర్ లేదన్నట్లే. హిట్ మెషీన్‌గా పేరు తెచ్చుకున్న అనిల్.. ఇప్పటిదాకా అపజయం అన్నదే లేకుండా సాగిపోతున్నాడు. ఒక్క 'ఎఫ్-3' మాత్రమే ఓ మోస్తరు ఫలితంతో సరిపెట్టుకుంది కానీ.. ఇప్పటిదాకా అనిల్ తీసిన మిగతా సినిమాలన్నీ హిట్లు, సూపర్ హిట్లు, బ్లాక్‌బస్టర్లే. ఆయన సినిమాలో నటిస్తే ఒక సక్సెస్ జమ అయినట్లే. అందులోనూ చాలా ఏళ్లుగా హిట్ అన్నదే లేక ఇబ్బంది పడుతున్న ఆర్టిస్టులకు అనిల్ ఛాన్స్ ఇస్తే వాళ్ల ఆనందానికి అవధులు ఉండవు. ఇప్పుడు కన్నడ భామ కృతి శెట్టి ఇదే ఆనందంలో ఉంది. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కలయికలో అనిల్ తీయబోతున్న కొత్త సినిమాలో కృతిని ఒక కథానాయికగా ఎంచుకున్నట్లు ఇంతకుముందే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడా విషయం అధికారికం అయింది. కృతి కథానాయికగా నటించిన తమిళ చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' తెలుగు ప్రి రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా వచ్చిన అనిల్.. తన తర్వాతి చిత్రంలో కృతి నటించనున్న విషయాన్ని ధ్రువీకరించాడు. ప్రచారంలో ఉన్నట్లే కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి కనిపించనున్నట్లు కూడా అనిల్ వెల్లడించాడు. దీంతో ఇక ఈ చిత్రంలో వెంకీ సరసన ఎవరన్నదే తేలాల్సి ఉంది. ఈ పాత్రకు కీర్తి సురేష్ పేరు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. తెలుగులో 'ఉప్పెన' లాంటి బ్లాక్ బస్టర్ మూవీతో కథానాయికగా పరిచయం అయి.. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు లాంటి సక్సెస్ ఫుల్ చిత్రాల్లో నటించిన కృతికి.. ఆపై వరుసగా ఫ్లాపులే ఎదురయ్యాయి. ఆమె ఫ్లాపుల పరంపర ఇప్పటికే అరడజనుకు చేరుకుంది. 'ఎల్ఐకే' అయినా హిట్ అందిస్తుందేమో అని ఆమె ఎదురు చూస్తోంది. వరుసగా రెండు సంక్రాంతి పండుగలకు 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రాలతో భారీ విజయాలందుకున్న అనిల్.. ఇప్పుడు తీయబోయే సినిమాతో మరోసారి సంక్రాంతినే టార్గెట్ చేయబోతున్నాడు

## రైటర్ గారు... చేదుగా ఉన్నా నిజమే చెప్పారు





రచయిత బీవీఎస్ రవి ఒక్కోసారి బాగా ఓపెన్ అయిపోతారు. ఉన్నది ఉన్నట్టు చెప్పేస్తారు. తాజాగా మా ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ దురంధర్ ని టాలీవుడ్ లో కనక తీస్తే అయిదు వందల కోట్లు ఖర్చు పెట్టించి, క్వాలిటీ తక్కువగా ఉన్న ప్రోడక్ట్ చేతిలో పెడతారని, పరిస్థితులు అలా తయారయ్యాయని కుండబద్దలు కొట్టేశారు. అయన ఫలానా సినిమా గురించని ఉదాహరణలు చెప్పలేదు కానీ కొంచెం ప్రాక్టికల్ గా ఆలోచిస్తే అందులో ఎంత చేదు నిజం ఉందో అర్థమవుతుంది. నిజమే. మనోళ్లు గ్రాండియర్ల మీద పెడుతున్న దృష్టి కంటెంట్ల మీద పెట్టరు. ఒక ప్యాన్ ఇండియా మూవీ అయిదు సంవత్సరాలు తీస్తారు. తీరా చూస్తే మూడో రోజే థియేటర్లు ఖాళీ. ఇంతోటి దానికి మళ్ళీ సీక్వెల్ ఉందంటూ చివర్లో శుభం కార్డు దగ్గర ట్విస్టు. అదిచ్చిన నష్టాలకు సదరు నిర్మాత హైదరాబాద్ రావడమే మానేశారు. తెరనిండా స్టార్ క్యామియోలు నిండిపోయిన ఇంకో డివోషనల్ మూవీ అద్భుతాలు చేస్తుందనుకుంటే ఆయాసంతో రెండో వారమే వెనక్కు వచ్చేసింది. ఇక్కడ చెప్పింది రెండింటి గురించే కానీ చెప్పుకుంటూ పోతే ఇలాంటివి బోలెడు వస్తాయి. దురంధర్ కేవలం రెండేళ్లలో రెండు వందల యాభై కోట్లతో తీసి మూడు నెలల్లో రెండు భాగాలు రిలీజ్ చేశారు దర్శకుడు ఆదిత్య ధార్. కట్ చేస్తే మొత్తం కలిపి మూడు వేల కోట్ల గ్రాస్ దాటిపోయేలా ఉంది. ఇంత చేసి ఇదేమైనా ఫాంటసీ మూవీనా అంటే కాదు. జానపదమా అంటే కాదు. అసలు మనకు సంబంధమే లేని శత్రుదేశం పాకిస్థాన్ బ్యాక్ డ్రాప్ లో తీసిన ఏడున్నర గంటల స్పై డ్రామా. బీవీఎస్ రవి అన్నట్టు తెలుగు దర్శకులు ఫోకస్ పెట్టాల్సింది ఇలాంటి క్వాలిటీ మీదే. ఎంతసేపూ ఎలివేషన్లు, బ్యాక్ గ్రౌండ్ స్కోర్లతో హీరోయిజం చూపించే కథలు కాకుండా ఆడియన్స్ కి త్వరగా కనెక్ట్ అయ్యేలా డ్రామాలు ఆవిష్కరించాలి. రాజమౌళి, సుకుమార్ తరహాలో ప్రతిఒక్కరు కష్టపడాలి. అంతే తప్ప క్రేజ్ ఉంది కదాని కాంబినేషన్ సెట్ కాగానే సెట్స్ వైపు పరుగులు పెట్టకూడదు. దీని వల్ల నిర్మాతలకు జేబులకు చిల్లులు పడటం తప్ప కాసుల జల్లులు కురవవు.




## తెలుగులో డబ్బింగ్ చెప్పి, వెనక్కి తగ్గిన హీరో



ఎప్పుడు ఎవరి కెరీర్ ఎలా మలుపు తిరుగుతుందో చెప్పలేం. తమిళ కుర్రాడు ప్రదీప్ రంగనాథన్‌కు... నాలుగేళ్ల ముందు వరకు తమిళనాడులోనే పెద్దగా పాపులారిటీ లేదు. కానీ ఇప్పుడు అతను మూడు వంద కోట్ల సినిమాలు ఇచ్చిన హీరో. అటు తమిళఃలోనే కాక.. ఇటు తెలుగులోనూ మంచి ఫాలోయింగ్, మార్కెట్ సంపాదించాడు ఈ టాలెంటెడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ స్వీయ దర్శకత్వంలో నటించిన లవ్ టుడేతో సెన్సేషన్ క్రియేట్ చేసిన అతను.. తర్వాత డ్రాగన్, డ్యూడ్ చిత్రాలతోనూ విజయాలందుకున్నాడు. ఇప్పుడు ఎల్ఐకే చిత్రంతో ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. తెలుగులో తన ఫాలోయింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, డబ్బింగ్ విషయంలో ఎంతో జాగ్రత్త పడుతున్నాడు ప్రదీప్. అలాగే ప్రమోషన్లకు కూడా గట్టిగా చేస్తున్నాడు. అంతటితో ఆగకుండా ఎల్ఐకేకు తనే సొంతంగా డబ్బింగ్ కూడా చెప్పుకోవాలని అనుకున్నాడట ప్రదీప్. కానీ తన వాయిస్ కుదరకపోవడంతో వెనక్కి తగ్గినట్లు వెల్లడించాడు. ఇటీవల రిలీజ్ చేసిన ఎల్ఐకే టీజర్లో వినిపించింది తన వాయిసే అని వెల్లడించాడు ప్రదీప్. తననే సొంతంగా డబ్బింగ్ చెప్పుకోమని దర్శకుడు విఘ్నేష్ శివన్ చెప్పడంతో తాను ఆ ప్రయత్నం చేసినట్లు ప్రదీప్ తెలిపాడు. కానీ తన వాయిస్ విన్న కొంతమంది తెలుగు ప్రేక్షకులు.. బాగా ట్రై చేశావు, కానీ ఇంకెప్పుడూ ట్రై చేయకు అని సలహా ఇచ్చినట్లు సరదాగా వ్యాఖ్యానించాడు ప్రదీప్. తన డబ్బింగ్ సరిగా కుదరకపోవడంతో ఈసారికి మళ్లీ వాసు సర్‌తోనే తన పాత్రకు డబ్బింగ్ చెప్పించినట్లు ప్రదీప్ వెల్లడించాడు. ఐతే తాను ఇంతటితో ఆగిపోనని.. మళ్లీ ప్రయత్నిస్తానని.. తెలుగు మీద పట్టు సాధించి అందరూ మెచ్చేలా భవిష్యత్తులో తన పాత్రకు డబ్బింగ్ చెప్పుకుంటానని ధీమా వ్యక్తం చేశాడు ప్రదీప్. ఉప్పెన భామ కృతి శెట్టి కథానాయికగా నటించిన ఎల్ఐకేలో ఎస్.జె.సూర్య విలన్ పాత్ర చేశాడు. నయనతార నిర్మాత. 20240లో జరిగే కథతో ఈ సినిమా తెరకెక్కింది. షూట్ మొదలైన రెండేళ్ల తర్వాత ఈ చిత్ర విడుదలవుతోంది.



# బిజినెస్ న్యూస్



## జియో నుంచి రూ.339తో కొత్త ప్రీపెయిడ్ ప్లాన్



ప్రముఖ టెలికాం కంపెనీ రిలయన్స్ జియో కొత్త ప్రీపెయిడ్ ప్లాన్ ను తీసుకొచ్చింది. రూ.339 రీఛార్జితో క్యాలెండర్ మంత్ వ్యాలిడిటీని అందిస్తోంది. అంటే ఒకసారి రీఛార్జి చేసుకుంటే మళ్లీ వచ్చే నెల అదే తేదీన (నెలలో ఉన్న రోజులతో సంబంధం లేకుండా) రీఛార్జి చేయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న అందరి యూజర్ల కోసం ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. క్యాలెండర్ మంత్ వ్యాలిడిటీ, అదనపు టాక్‌టైమ్ కోరుకునేవారికి ఈ ప్లాన్ మంచి ఎంపిక. జియో కొత్త రూ.339 ప్లాన్‌తో రోజుకు 1.5 జీబీ డేటా పొందొచ్చు. రోజుకు 100 ఎస్సెమ్మెస్‌లు, అపరిమిత కాల్స్ లభిస్తాయి. జియో టీవీ, జియో టీవీ ఏఐ క్లౌడ్ యాప్ సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది. ఈ ప్లాన్‌లో ఇతర ఓటీటీ సదుపాయాలను జియో కల్పించకపోవడం గమనార్హం. దాదాపు ఇవే ఆఫర్లతో రూ.319 ప్లాన్‌ను జియో అందిస్తోంది. కానీ, రూ.339 ప్లాన్‌లో అదనంగా రూ.14.95 టాక్‌టైంను ఆఫర్ చేస్తోంది. దీన్ని అంతర్జాతీయ కాల్స్, ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చు.

## 350 సీసీ ఇంజిన్‌తో ట్రయంఫ్ బైక్స్.. మోడల్స్, ధరల వివరాలు ఇవీ..



బ్రిటీష్ మోటార్ సైకిల్ కంపెనీ ట్రయంఫ్ (ఌతీఱబఎజూష్ట) భారత్‌లో తన వాహన ఫోర్ట్‌ఫోలియోను అప్‌డేట్ చేసింది. గతంలో 400 సీసీ ఇంజిన్‌తో పలు మోడళ్లను లాంచ్ చేసిన ఆ కంపెనీ.. తాజాగా 350 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో కొత్త మోటార్ సైకిళ్లను లాంచ్ చేసింది. 350సీసీ కంటే తక్కువ సామర్థ్యం కలిగిన మోటార్ సైకిళ్లపై తక్కువ జీఎస్టీ పడుతుండడంతో ఆ మేర ఇంజిన్ సామర్థ్యాన్ని తగ్గిస్తూ స్పీడ్ 400, స్పీడ్ టీ4, థ్రక్స్టన్ 400, స్క్రాంబ్లర్ 400, స్క్రాంబ్లర్ 400శజ మోడళ్లను లాంచ్ చేసింది. ఇంజిన్ సామర్థ్యాన్ని తగ్గించినప్పటికీ అదే పేరును కొనసాగించింది. గతంతో పోలిస్తే కొన్నింటి ధరలను తగ్గించగా.. మరికొన్నింటి ధరలు పెరిగాయి.

ట్రయంఫ్ స్పీడ్ టీ4: గతంలో 398 సీసీ సామర్థ్యంతో తీసుకొచ్చిన స్పీడ్ టీ4ను ఈసారి 349 సీసీ సామర్థ్యంతో విడుదల చేశారు. ధర మాత్రం రూ.1.95 లక్షలుగా నిర్ణయించారు. ధరలో ఎలాంటి మార్పూ చేయలేదు.

ట్రయంఫ్ స్పీడ్ 400: ట్రయంఫ్ స్పీడ్ 400 మోడల్ ధరను గతంతో పోలిస్తే రూ.7 వేలు తగ్గించి రూ.2.31 లక్షలుగా నిర్ణయించారు. గత ఇంజిన్ 40 హెచ్‌పీ పవర్‌ను ఉత్పత్తి చేయగా.. కొత్త బైక్ 37 హెచ్‌పీని ఉత్పత్తి చేస్తుంది.

ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 400: ఈ మోడల్‌పై గతంతో పోలిస్తే ధరను రూ.10,736 మేర తగ్గించారు. 349 సీసీ ఇంజిన్, 37 హెచ్‌పీ పవర్‌తో తీసుకొచ్చారు.

ట్రయంఫ్ స్క్రాంబ్లర్ 400 శజ: కొత్త స్క్రాంబ్లర్ 400 శజ ధర రూ.2.98 లక్షలుగా నిర్ణయించారు. గతంతో పోలిస్తే ఎక్స్‌షోరూమ్ ధర రూ.1,793 మేర పెరిగింది. డిజైన్‌లో పెద్దగా మార్పులు చేయలేదు.

ట్రయంఫ్ థ్రక్స్టన్ 400: కొత్త థ్రక్స్టన్ 400ను రూ.2.65 లక్షల వద్ద లాంచ్ చేశారు. గత మోడల్‌తో పోలిస్తే ధరను రూ.11వేలు తగ్గించారు. ఇందులోని 349 సీసీ ఇంజిన్ 40 హెచ్‌పీ పవర్‌ను, 32 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. గతంలో 42 హెచ్‌పీ, 37.5 ఎన్ఎంగా ఉండేది.

## సీజ్ ఫైర్‌పై ఆశలు.. నష్టాల నుంచి భారీ లాభాల్లోకి సూచీలు



దేశీయస్టాక్ మార్కెట్ సూచీలు యూటర్న్ తీసుకున్నాయి. సోమవారం ఉదయం నష్టాల్లో ట్రేడైన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి వచ్చాయి. అమెరికా- ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలు మార్కెట్ రికవరీకి దోహదం చేశాయి. సెన్సెక్స్ కనిష్ఠాల నుంచి 1378 పాయింట్ల మేర కోలుకుంది. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లు పెరిగి రూ.427 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 73,477.53 (క్రితం ముగింపు 73,319.55) పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 72,728.66 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. కాల్పుల విరమణకు సంబంధించిన వార్తలు రావడంతో లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 74,207.46 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 787.30 పాయింట్ల లాభంతో 74,106.85 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 255.15 పాయింట్ల లాభంతో 22,968.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సన్‌ఫార్మా స్టాక్స్ నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4689 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవీ..

ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలు: పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ కోసం ఒక ఒప్పంద ప్రణాళిక సిద్ధమైనట్లు వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపాయి. హార్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్యం మళ్లీ ప్రారంభమయ్యే అవకాశం ఉండటం మార్కెట్‌కు పాజిటివ్‌గా మారింది.

తగ్గిన క్రూడాయిల్: శాంతి చర్చల వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల కంటే దిగువకు చేరింది. ఇది మన దేశ ఆర్థిక వ్యవస్థకు, ద్రవ్యోల్బణం నియంత్రణకు ఉపకరిస్తుంది.

పుంజుకున్న రూపాయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యల వల్ల అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 93.04 స్థాయికి వచ్చింది. కరెన్సీ మార్కెట్‌లో ఒడుదొడుకులు తగ్గడం స్టాక్ మార్కెట్ రికవరీకి దోహదపడింది. దీనికితోడు ఆసియా మార్కెట్లైన జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పి రాణించడమూ మన మార్కెట్ సూచీలకు కలిసొచ్చింది.

## అరుదైన మైలురాయి చేరుకున్న అమూల్..

### ఏడాదిలో లక్ష కోట్ల వ్యాపారం




దేశంలో డైరీ ఉత్పత్తుల్లో అగ్ర సంస్థగా ఉన్న అమూల్ అరుదైన ఘనత సాధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్ల వ్యాపార సంస్థగా నిలిచింది. ఈ ఏడాది సంస్థ ఏకంగా 11 శాతం వృద్ధి సాధించింది. అమూల్.. గుజరాత్‌కు చెందిన సంస్థ. ద గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్ (జీసీఎంఎంఎఫ్) సంస్థ అమూల్ బ్రాండ్‌తో వ్యాపారం నిర్వహిస్తుంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 11 శాతం వృద్ధితో, లక్ష కోట్లకుపైగా వ్యాపారాన్ని నిర్వహించినట్లు సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సంస్థ ఇంతకుముందు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.90,000 కోట్ల వ్యాపారం సాధించింది. ఇప్పుడు దీన్ని అధిగమించి, భారీ లాభాలతో లక్ష కోట్లు దాటింది. అమూల్.. దేశంలో టాప్ డైరీ బ్రాండ్‌గా కొనసాగుతోంది. ఈ సంస్థ దాదాపు 1,200 రకాల ఉత్పత్తుల్ని మార్కెటింగ్ చేస్తోంది. ఆధునిక వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు తన మార్కెటింగ్ వ్యూహాల్ని మార్చుకుంటూ వస్తోంది. ఈ ఫెడరేషన్‌లో 18 జిల్లా కో ఆపరేటివ్ సంస్థలు కూడా సభ్యత్వం కలిగి ఉన్నాయి. భారీ లక్ష?్యన్ని చేరుకున్న సందర్భంగా జీసీఎంఎంఎఫ్ చైర్మన్ అశోక్‌భాయ్ చౌదరి స్పందించారు. లక్షలాది మంది వినియోగదారులు, నిరంతరం శ్రమించే 36 లక్షల మంది రైతుల నమ్మకం కారణంగా ఈ విజయం సాధ్యమైందన్నారు జీసీఎంఎంఎ సంస్థ దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా అతిపెద్ద డైరీ సంస్థ. ఇందులో 36 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. పాలు, పాల ఉత్పత్తుల్ని 50కిపైగా దేశాల్లో విక్రయిస్తోంది. స్పెయిన్ సహా యూరప్ దేశాల్లో, అమెరికాలోనూ వ్యాపారం చేస్తోంది. రోజూ 31 మిలియన్ లీటర్ల పాలను సేకరిస్తోంది. సంవత్సరానికి 24 బిలియన్ల ప్యాకెట్లు విక్రయిస్తోంది. వీటిలో పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, ఐస్ క్రీమ్ వంటి పలు పదార్థాలున్నాయి.

## జర్నలిస్టులకు ఉచిత మెగా హెల్త్ క్యాంప్

### - సద్వినియోగం చేసుకోవాలని కోరిన కలెక్టర్

**తిరుపతి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ ఆదేశాలతో తిరుపతి జిల్లాలో అక్రెడిటేషన్ గల పాత్రికేయులకు ఈ నెల 07 నుండి 10 వరకు అమరా ఆసుపత్రి (కరకంబాడి) సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సోమవారం తెలిపారు. ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తోందని, ఇందులో భాగంగా అమరా ఆసుపత్రి లో జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ క్యాంప్ ఉ.8.00 గం.లకు ప్రారంభం అవుతుందని, వైద్య పరీక్షలకు హాజరయే వారు ఆన్ లైన్ లో షేర్ చేసిన అప్లికేషన్ ఫారంలో వివరాలు నింపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వాట్స్ అప్ లో షేర్ చేసిన అప్లికేషన్ ఫారంను నింపి ఆసుపత్రి లో ఐ అండ్ పి ఆర్ సిబ్బందికి సమర్పించాలని తెలిపారు. జిల్లాలో అక్రెడిటేషన్ కలిగిన జర్నలిస్ట్ లు ఈ సౌకర్యంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలిపారు. రక్త పరీక్షలు, లిపిడ్ ప్రొఫైల్ పరీక్షల కోసం, ఖాళీ కడుపుతో రావాలని, అలాగే గతంలో చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్ట్ ఏవైనా ఉంటే వాటిని తీసుకురావాలని సూచించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 405 అర్జీలు



**తిరుపతి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన, సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, అనురాధ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలితో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు తాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. సోమవారం పీ జి ఆర్ ఎస్ లో. మొత్తం 405 అర్జీలు రాగా అందులో రెవెన్యూ కు సంబంధించినవి 244 ఉన్నాయి. మిగతావి శాఖల వారీగా పంచాయతీ రాజ్ -34, హోమ్-20, సర్వే శాఖ-20,పేదరిక నిర్మూలన సొసైటీ -14, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ -12, పాఠశాల విద్యాశాఖ- 8, హౌసింగ్ -6, సివిల్ సప్లై- 6, విద్యుత్ శాఖ- 5, కుటుంబ సంక్షేమ శాఖ- 5, జల వనరుల శాఖ- 4, రూరల్ డెవలప్మెంట్ -4, వ్యవసాయ శాఖ- 3, రుయా -2, భూగర్భ జల గనుల శాఖ -2, వయో వృద్ధుల , కార్మిక శాఖ -2, కో-ఆపరేటివ్ సొసైటీస్ 2, వికలాంగుల, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ- 1, తుడా -1, రిజిస్ట్రేషన్ శాఖ -1, ఆర్టీసీ- 1, మహిళా శిశు సంక్షేమ శాఖ- 1 , మత్స్య శాఖ- 1,సాంఘిక సంక్షేమ శాఖ- 1, డ్రగ్స్ కంట్రోల్ -1, పశుసంవర్ధక శాఖ -1, ఎక్సైజ్ శాఖ- 1, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ -1. సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## అన్నమయ్య కళాక్షేత్రంలో కుచేలోపాఖ్యానం ప్రవచనం

### - ఆధ్యాత్మిక చైతన్యాన్ని ఇనుమడింపజేసిన శతావధాని భరత్ శర్మ



**తిరుపతి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తమకు తోచినది నివేదనగా సమర్పించి, తనను ఆశ్రయించిన భక్తులను శ్రీకృష్ణ పరమాత్మ ఎన్నడూ విడువబోడని శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అన్నమాచార్య కళామందిరంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన శతావధాని, ప్రవచనకర్త ఉప్పలధడియం భరత్ శర్మ కుచేలోపాఖ్యానంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, నవ విధభక్తి మార్గాలలో సఖ్యం ద్వారా కుచేలుడు ఏ విధంగా శ్రీకృష్ణుని ఆశ్రయించి, తన వద్దనున్న పిడికెడు అటుకులను సమర్పించి, ఆ శ్రీకృష్ణుని కటాక్షంతో అష్టైశ్వర్యాలను పొందాడో, అటువంటి అచంచలభక్తి ద్వారా భగవంతుని సాన్నిధ్యాన్ని చేరుకోవచ్చని తెలియజేశారు. భగవంతుని లీలలను తెలుసుకొని ఆనందించడానికి, తరించడానికి భాగవత మహాపురాణం ఈ కలియుగ మానవులకు ఒక గొప్ప వరం అని పేర్కొన్నారు.ప్రస్తుతం ఉన్న వైజ్ఞానిక యుగంలో పురాణాల అధ్యయనం ద్వారా అనేక వైజ్ఞానిక, సామాజిక, వ్యవహారిక విషయాల పరిశోధన ద్వారా మానవుల దైనందిన జీవితాలు మెరుగుపడతాయని భరత్ శర్మ తెలియజేశారు. ఈ సందర్భంగా, రాయలసీమ రంగస్థలి అధ్యక్షులు గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి కే ఎన్ రాజా, కళాకారులు, అన్నమాచార్య ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కోకిల మరియు సిబ్బంది ప్రవచనకర్త శతావధాని భరత్ శర్మను ఘనంగా సత్కరించారు.




## రుయా సూపరింటెండెంట్‌కు ఘన సత్కారం

### -అంబేద్కర్ భవన్ కమిటీ సభ్యుల అభినందనలు

**తిరుపతి, ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రుయా హాస్పిటల్ నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ బాదూరు మనోహర్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అంబేద్కర్ భవన్ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. కమిటీ చైర్మన్ డా. పి. పరమశివన్ ఆధ్వర్యంలో సభ్యులు, దళిత సంఘ నాయకులు కలిసి శాలువాతో డాక్టర్ మనోహర్‌ను సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రుయా హాస్పిటల్ పీడియాట్రిక్స్ వైద్య విభాగంలో ఆయన అందిస్తున్న సేవలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. ప్రొఫెసర్‌గా అనేక మంది విద్యార్థులకు ఉన్నత విద్యను బోధించి, ప్రతిభావంతులైన వైద్యులను తయారు చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.రుయా హాస్పిటల్‌కు వచ్చే రోగులలో ఎక్కువ మంది పేదవారే కావడంతో, వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని కమిటీ తరపున కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ నాగేశ్వరరావు, ట్రెజరర్ కె. మురళి, సభ్యులు పి.ఎస్.చిరంజీవి, పానకం ఇంద్రముని, పి. గిరి, దళిత సంఘ నాయకులు ద్వారకా, చరణ్, సురేంద్ర, తిరుమల, రవి, స్టాఫ్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రామాపురం డంపింగ్ యార్డును పరిశీలించిన మంత్రి నారాయణ



**తిరుపతి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగరపాలక సంస్థ నిర్వహణ లోని రామాపురం డంపింగ్ యార్డును మంత్రి నారాయణ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చెత్త ప్రభుత్వం అని, పన్ను వసూలు చేసి చెత్తను మాత్రం వదిలేసి వెళ్ళిందని విమర్శించారు. ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిందని, రాష్ట్రం లోని123 మున్సిపాలిటీలను చెత్తమయం చేసి వెళ్ళిందన్నారు. 2024 లో కూటమి అధికారంలోకి వచ్చాక చెత్త తొలగింపుపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టారని, ఏడాదిలోగా చెత్తనంతా తొలగించాలని ఆదేశించారన్నారు ఆ మేరకు ఏడాదిలో 85 లక్షల టన్నుల చెత్త తొలగించామని చెప్పారు. గ్రౌండ్ కంటే కింద 68 లక్షల టన్నుల చెత్త ఉందని, దాన్ని రెండు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు. వేస్ట్ ఎనర్జీ పవర్ జనరేషన్ ప్లాంట్లతోనే శాశ్వత పరిష్కారం చేయాలని టోక్యో ,సింగపూర్ లో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ లను సీఎం స్వయంగా పరిశీలించారన్నారు.ఆ స్థాయిలో ఏపీ లో కూడా 10 ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, తమ హయాం లోనే విశాఖ ,గుంటూరు ప్లాంట్లు పూర్తయ్యాయన్నారు. వాటి ద్వారా రోజుకి 2800 టన్నుల చెత్త బర్న్ అవుతోందని, మిగిలిన ఎనిమిది ప్లాంట్లను వైఎస్సార్సీపీ నిలిపివేసిందన్నారు. కుప్పలు , కుప్పలు చెత్తను పేర్చి ప్రజారోగ్య పరిరక్షణపై నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరు ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, కాకినాడ , నెల్లూరు ,విజయవాడ ,తిరుపతి ,కర్నూలు ,కడపల్లో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. అవి పూర్తయితే రాష్ట్రంలో రోజుకు వచ్చే 7000 వేల టన్నుల చెత్త బర్న్ అయిపోతుందని , విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వందలకొద్దీ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు ఉన్నట్లు మంత్రి వివరించారు. రాబోయే రెండేళ్ళల్లో రాష్ట్రాన్ని చెత్తరహిత రాష్ట్రంగా మార్చాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమని ఆయన చెప్పారు. మంత్రి పర్యటన లో ఎమ్మెల్యే లు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, సి డి ఎమ్ ఏ సంపత్ కుమార్, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య, తదితరులు ఉన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు

### -కమిషనర్ ఎన్. మౌర్య

**తిరుపతి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 41 వినతులు అందినట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో 36 మంది కార్యాలయానికి నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, ఐదుగురు ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. రవీంద్ర నగర్ లో కొత్తగా వేసిన తాగునీటి పైప్ లైన్ ద్వారా నీటి సరఫరా చేయాలని, యూడిఎస్ లైన్ మరమ్మత్తు చేయాలని స్థానికులు కోరారు, తన ఇల్లు విక్రయించుకున్నా తన పేరు మీద కాకుండా వేరొకరి పేరు మీరు పన్ను డిమాండ్ ఇస్తున్నారని, పరిష్కరించాలని, కొర్లగుంట మారుతీ నగర్ లో తన స్థలం ఆక్రమించి నిర్మాణం చేస్తున్నారని, తాతా నగర్ వద్ద ఖాళీ జాగాలో చెత్త వేస్తున్నారని, ఇందిరా మైదానం వద్ద టెంకాయల వ్యాపారి వ్యర్థాలను వేయడం వలన ఇబ్బందిగా ఉందని, గాలివీధి లో అపరిశుభ్రతను పరిష్కరించాలని, ఇందిరా మైదానం వద్ద చెత్త తొలగించాలని, గొల్లవాని గుంట వద్ద సిసి రోడ్లు, కాలువలు వేయించాలని, ఇళ్లు లేని పేదలకు ఇల్లు పథకం కింద ఇంటికోసం తాము చెల్లించిన డబ్బులు తిరిగి ఇప్పించాలని వినతులు, ఫిర్యాదులు అందాయి. ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను కమిసనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదాదేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## మెటర్నిటీ ఆస్పత్రిలో బాలింతలకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ



**తిరుపతి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ ప్రసూతి వైద్యశాలలో హ్యూమన్ మిల్క్ బ్యాంకు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రమీలా దేవి, సివిల్ సర్జన్ డాక్టర్ రామనారాయణ రెడ్డి అధ్యక్షతన ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల లోని (పోస్ట్ నేటల్ మదర్స్ ) బాలింతలకు 50 గ్రామల డ్రై ఫ్రూట్ ను క్లబ్ మెంబర్స్‌తో కలసి అందచేశారు. తల్లి పాలును పెంపొందించుకునేందుకు వీలుగా హాస్పిటల్ లో అందించే పోషక ఆహారంతో పాటు అదనంగా డ్రై ఫ్రూట్స్ ను పంపిణీ చేస్తున్నట్లు రొటేరియన్ డాక్టర్ టెంకాయల దామోదరం తెలిపారు. హ్యూమన్ మిల్క్ బ్యాంకు కు తల్లి వచ్చి, తన బిడ్డకు పాలు ఇచ్చి, ఎక్కువ గా వున్నప్పుడు మిగులు పాలను దానంగా ఇచ్చే ప్రతి తల్లికి, ప్రతి సారి ఈ డ్రై ఫ్రూట్స్ ఇస్తున్నట్లు తెలియచేశారు.డాక్టర్ ప్రమీల దేవి మాట్లాడుతూ .. తల్లిపాలు ప్రాముఖ్యత గురించి బాలింతలకు తెలియపరచి, వారిలో అవగాహన పెంచితే హ్యూమన్ మిల్క్ బ్యాంకు ద్వారా ఎక్కువ మంది శిశువులకు తల్లి పాలను అందించి, వారి ఆరోగ్యాన్ని పెంపొందించ వచ్చునన్నారు. తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమని, ముఖ్యంగా మొదటగా వచ్చే ముర్రుపాలు శిశువుకు వ్యాధినిరోధక శక్తి కలిగి ఉంటుందని, వ్యాధులు నుండి శిశువు ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని, తల్లి పాలు ఒక్కటే బిడ్డకు రోజుకు10 నుండి 12 సార్లు ఇవ్వాలని, పాలు ఇచ్చినప్పుడల్లా బిడ్డను భుజానికి తీసుకొని బర్పింగ్ చేయాలని ( వీపుమీద చిన్నగా తట్టాలని ), ఇలా చేయుట వలన బిడ్డ పాలతోపాటు గాలిని కూడా తీసుకుంటారన్నారు ఇలా చేయడం వలన గాలి వెలుపలకు పోయి పొట్ట ఆరోగ్యం గా ఉంటుందని తల్లులకు ఆరోగ్య బోధన చేసారు, అలాగే పరిశుభ్రత పాటించాలని, వేసవి కాలంలో నీరు, మజ్జిగ ఎక్కగా తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమం లో రోటరీ క్లబ్ హ్యూమన్ మిల్క్ బ్యాంకు చైర్మన్ టెంకాయల దామోదరం దంపతులు, తిరుపతి రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాజేంద్ర శెట్టి దంపతులు,హేమచందర్, విజయ,జగదీశ్, హ్యూమన్ మిల్క్ బ్యాంకు ఇంచార్జి నోడల్ ఆఫీసర్ డా చందన హాస్పిటల్ నోడల్ ఆఫీసర్ డా శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ లెక్చరర్ డా నిర్మలమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ కళావతి, హెడ్ నర్స్లు అల్లి రాణి, హ్యూమన్ మిల్క్ బ్యాంకు ఇంచార్జి స్టాఫ్ నర్స్లు ప్రసూన, లక్ష్మి దేవి, కుసుమ ఇతర హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు

### -తిరుపతి నుంచి దండి మార్చి 2.0 డ్రగ్ ఫ్రీ సైకిల్ యాత్ర ప్రారంభం

### -యాత్రను ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ

**తిరుపతి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాదకద్రవ్యాల ప్రభావంతో చాలా దేశాలు చిన్నాభిన్నం అయ్యాయని, యువత మత్తుకు బానిసలు కాకూడదని కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ఎస్.వి యూనివర్సిటీ ఆడిటోరియంలో దండి మార్చ్ 2.0 – మాదకద్రవ్య రహిత ఆంధ్రప్రదేశ్ మిషన్ లో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఈగల్ టీం సమన్వయంతో అవగాహన సదస్సు జరిగింది. ముందుగా తిరుపతి నుండి విశాఖపట్నం వరకు చేపట్టదలచిన సైకిల్ యాత్రను కలెక్టర్ వెంకటేశ్వర్ , ఎస్పి ఎల్.సుబ్బారాయుడు, జెసి ఆర్.గోవిందరావు, అడ్మిన్ ఎస్పి ఈగల్ సంస్థ కె. నగేష్ బాబులతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. సదస్సులో వర్చువల్ విధానంలో ఈగల్ ఐజి ఏకే రవికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజం పై మాదక ద్రవ్యాల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వం మాదక ద్రవ్యాల వినియోగం పై కఠిన చర్యలు చేపడుతున్నాయన్నారు. యువత మత్తుకు బానిసలు కాకూడదని, మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం ద్వారా ఆరోగ్య రీత్యా, చట్టరీత్యా ఎదురయ్యే సమస్యల పై యువతకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మన రాష్ట్రంలో దండకారణ్యాల పరిధిలో ఉన్న ప్రాంతాలలో ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా గంజాయి సాగు తగ్గిందన్నారు. ప్రభుత్వం కఠినంగా ఉండి ఒక 'ఈగల్' టీమ్‌ను ఏర్పాటు చేసి, సీనియర్ ఐపిఎస్ అధికారుల ఆధ్వర్యం లో చర్యలు చేపట్టిందన్నారు. ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ , గంజాయి వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం యువతలో కొంతమంది డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమని. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అవసరమైతే పీడీ యాక్ట్ కూడా అమలు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలన ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి పాఠశాల, ప్రతి కుటుంబం నుండి ప్రారంభం కావాలని సూచించారు. ఎక్కడైనా డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ గ్రూప్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన బాధ్యత పోలీసులకే పరిమితం కాకుండా ప్రతివిద్యార్థి ఒక బాధ్యతాయుత పౌరుడిగా వ్యవహరించాలని, సమాజంలో ఉన్న ఈ రుగ్మతను నిర్మూలించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. గంజాయి అమ్మకం, సరఫరా లేదా వినియోగం అన్నీ నేరాలేనని స్పష్టం చేశారు. ఈ సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు మీడియా ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈగల్ ఎస్పి మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ , గంజాయి వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. సదస్సులో 1,15,000 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారన్నారు. విద్యార్థులు సమాజ భవిష్యత్తు అని పేర్కొంటూ, వారు సరైన మార్గంలో నడిస్తేనే దేశ అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రస్తుతం యువతలో కొంతమంది డ్రగ్స్ , గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, ఎస్.వి యూనివర్సిటీ విసి నరసింగారావు, శ్రీ పద్మావతి యూనివర్సిటీ విసి వి.ఉమ, ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. భూపతి నాయుడు, అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, కలాం వైబ్రెంట్స్ వ్యవస్థాపకుడు దండి విజయ్ కలాం, సిబ్బంది, విద్యార్థులు, ప్రొఫెసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సేవల్లో అలసత్వం తగదు

### - ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి,ఏప్రిల్ 6 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో వినియోగదారులకు మెరుగైన సేవలను అందించడంలో అధికారులు, సిబ్బంది అలసత్వాన్ని దరిచేరనీయొద్దని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి సూచించారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసులో సోమవారం ఉదయం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయడంలో జాప్యాన్ని సీఎండి దృష్టికి తీసుకువచ్చారు. సీఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రైతులకు ఫోన్ చేసి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు.ఆయా సెక్షన్ల వారీగా వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తుల సీనియారిటీ లిస్టును నోటీసు బోర్డులో ప్రదర్శించాలని, సీనియారిటీ ఆధారంగా సర్వీసులను మంజూరు చేయాలని సూచించారు. ఈ అంశంలో నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంస్థ పరిధిలో విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కాగా సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమం ద్వారా 55 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ & ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ & హెచ్‌ఆర్ డి) కె. గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్ఎసి) కె. రామ మోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, ఆర్. పద్మ, కె. ఆదిశేషయ్య, యం. మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణా, జనరల్ మేనేజర్లు విజయన్, జగదీష్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, లత, హరి, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027